## పెద్దకథ:




శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

బైతుమామయ్యకు పట్నం చూడాలని ఎన్నాళ్లనుంచో కోరిక. ఆయన జీవితమంతా రైలుకట్ట పక్కగా పొలాల మధ్య కలుగుల్లోనూ, బొరియల్లోనూ గడిచిపోయింది. ఆ జీవితంలో ఆహారం సంపాదించుకోవటమూ, పాములకు అందకుండా తప్పించుకోవటమూ, పొట్ట నించుకోవటమూ, నిద్రపోవటమూ, పాటుపడటమూ, విశ్రాంతి తీసుకోవటమూ తప్ప ఇంకేమీ లేదు.

రోజూ రైళ్లు పెద్ద మోతచేసుకుంటూ వచ్చేవి, వెళ్లేవి. అవి పట్నంపొయ్యే రైళ్లూ, పట్నంనుంచి వచ్చే రైళ్లూ. అప్పుడప్పుడూ ఆకాశంలో విమానాలు ఎగిరేవి. వాటిక్కూడా ఏదో పట్నంతో సంబంధమున్నదని మామకు తెలుసు. నాలుగైదేళ్ళ క్రితం బైతు మామయ్య చెల్లెలు సాహసించి పట్నం వెళ్లిపోయింది. ఆ తరవాత దాని జాడే తెలీదు.

పట్నం చూసినట్టూ అవుతుంది, చెల్లెలి సంగతి కనుక్కున్నట్టూ అవుతుందని ఒక నాటిరాత్రి మామ పట్నం బయల్దేరాడు. అట్టే పెద్ద దూరం ఏమీ లేదు. ఏడెనిమిది మైళ్లలోపు. గట్టిగా కాలుసాగిస్తే రెండు గంటల ప్రయాణం. కాని మామ పల్లెటూరివాడు కావటంచేత దారివెంబడి ఉండే చోద్యాలన్నీ చూస్తూ బయల్దేరాడు.

కొంతదూరం వెళ్ళాక రైలుకట్ట నానుకుని ఒక చిన్న మడుగు కనిపించింది. ఆ మడుగుఒడ్డున రెండు మూడు బుల్లి కప్పలు ఆడుకుంటున్నాయి.

“తల్లి ముండమొయ్య! ఈ కప్పలు ఒక్కనాడన్నా ఒళ్లు వొంచి పనిచేసిన పాపానపోవు. రేపటి మాట ఎట్లనా అన్న విచారమే లేదు. వీటి జన్మ చెడా!” అని తిట్టుకున్నాడు మామ.

మరికొంచెం దూరాన లెవెల్ క్రాసింగు దగ్గర గేటు మూసేశారు. ఎర్రదీపం ధగధగలాడుతోంది. ఆ దీపంకాంతిలో లారీ ఒకటి నిలబడిఉంది. లారీమీద బస్తాలు వేసి ఉన్నాయి.

బైతుమామ మీసాలాడించి, ముట్టెఎత్తి వాసన చూసి, “వొడ్లు!” అనుకున్నాడు. చప్పున మామ లారీవెనకమాటుకు చేరి ఒక్క గంతుతో లారీఅంచు పట్టుకుని లోపలికి ఎక్కి బస్తాలమధ్య ప్రవేశించి, ఒక్కొక్క బస్తానుంచీ మోసరాకు రెండేసి గింజలు బయటికి లాగి, కొరికి, నాణ్యంచూసి తుబుక్కున పొట్టు ఉమ్మేసి, లోపలిగింజ ముందుపళ్ళమధ్య మరబట్టి, “ఎబ్బె, నాసిరకం!...ఇదుగో, ఈపాటి అయినా ఉండాలి గింజ... ఈ గింజకూడా ఏమంత ఘరవాలా...అయినా మాపొలంగింజకివన్నీ దిగదుడుపే,” అనుకోసాగాడు.

లారీలో చాలా బస్తాలున్నాయి. మామకు నోటినిండా పని. ఈ హడావుడిలో మెయిలు వెళ్లిపోయిన సంగతి మామకు లీలగామాత్రమే తెలుసు. అంతవరకూ స్థిమితంగా ఉన్న లారీ ఒక్కసారిగా టుర్రుమనటమూ, మామకు ఒళ్లంతా సలపరించినట్టు

కావటమూ తెలిసివచ్చే సమయానికి లారీ కదల్నే కదిలింది.

“సరే, పోనీలే. ఎక్కడాగితే అక్కడే దిగొచ్చు,” అనుకున్నాడు మామ. చెయ్యి మించినదానికి విచారించే అలవాటు లేని కారణంచేత సరిపెట్టుకున్నాడే గాని మామకి ప్రయాణం ఎంతమాత్రమూ సుఖంగా లేదు. ఎందుకొచ్చిన లారీ? ఒళ్లంతా ఒకేమయిన అదురుడాయె. ఎటు పోతున్నదీ, చుట్టుపక్కల ఏం జరుగుతున్నదీ చూడ్డొల్లగాదాయె! పోయే బండీ ఎకాయెకీన పోతుందా అంటే పోదాయె! ఇక్కడాగా, అక్కడాగా! ముక్కుసూటిగా పోయి చావదుగా, ఇటు దిరగా అటు దిరగా!

మామకు పొట్ట నిండిందిగాని సుష్టుగా తిన్నామన్న సంతృప్తి రాలా. “ఇంటికాడ తిన్నదారి వేరూ, బయట ఎంగిలిపడ్డదారి వేరూ,” అనుకున్నాడు మామ మీసాలు తుడుచుకుని, దవడలు చప్పరిస్తూ.

లారీ ఆగింది. మామ వెనకతలుపుమీది నుంచి తొంగి చూసేసరికి యమధర్మరాజల్లే ఎవడో ప్రత్యక్షమైనాడు.

“నీయిల్లు పడా! నువ్వుకూడా చేరావ్?” అన్నాడు యమధర్మరాజు మామతో అమర్యాదగా.

వాడిచేతిలో ప్రస్తుతానికి ఆయుధం లేకపోవటం గమనించి మామ తాపీగా తలుపు దిగి రోడ్డుపక్కకు జారాడు.

“ఏమిట్రా, అదీ?” అని మరో గొంతు వినిపించింది.

“పోతంత ఎలికె. ఇటుగా లగెత్తింది— లారీలోంచి దూకి,” అన్నాడు యమధర్మరాజు, చీకట్లో మామను గుర్తించలేక అటూ ఇటూ చూస్తూ.

“ఇంకేం పట్నం చేరనే చేరా!” అనుకున్నాడు మామ. రోడ్డు మైదానంలాగ సాఫీగా ఉంది. దారికటూ ఇటూ ఎంత లావు ఎలుకకూ కొరుకుడు పడని గోడలూ, ఎత్తయిన ఇళ్లూనూ.

“ఇదేనా పట్నం? ఒక గడ్డిమేటిలేదు. ఒక కంచె లేదు. వడ్లపురి లేదు. ఏం పట్నమిది?” అనుకున్నాడు మామ, నడిచి ముందుకు సాగుతూ.

రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. కాళ్లకింద ఎక్కడో నీరు ప్రవహించే చప్పుడు. ఎక్కడా ఎలుక దాగే చీకటికోణం లేదు. వీధివెంట అంతూ పొంతూ లేకుండా బారుగా దీపాలు. వీధిపొడుగునా కష్టపడి పరిగెత్తి మలుపు తిరిగేసరికి మళ్లీ అటువంటిదే ఇంకో వీధి.

“ఈ పట్నం ఈ లెక్కన ఎంతదూరం ఉన్నట్టు? ఇందులో కష్టపడి పనిచేసే ఎలుక లేం బతికేట్టు? మా నాయుడిగారి పొలంఉందంటే అందులో ఏమూల ఎవరున్నదీ, ఎప్పుడేం జరిగేదీ క్షణంలో మాఅందరికీ తెలుస్తుందిగదా? ఈ పట్నమహారణ్యంలో ఈ గోడలమధ్య ఎవరిని ఏ పిల్లిగండు మెడకొరికినా అతీగతీ ఉండదే?” అనుకున్నాడు మామ.

ఈవిధంగా ఆలోచించుకుంటూ ముందుకు పరిగెత్తే మామకాళ్లు నిగడదన్ని అట్లాగే నిలబడి నిశ్చేష్టుడై కొయ్యబారి, ఒళ్లంతా లారీఅదురుకు కంపించినట్టు కంపిస్తూ, మీసాలు నిక్కబొడుచుకుని మూతి పైనెత్తుకుని ఒక్కొక్క అడుగే ముందుకు వెయ్యసాగాడు. అంతదూరంలో, వీధికి అడ్డంగా ఇంత లావు పందికొక్కు శవం కనిపించింది.

“అరెరెరే! కలికాలం!” అనుకున్నాడు మామ. జన్మెత్తిన పందికొక్కుకు చావంటూ రాసిపెట్టిఉన్నమాట మామకు తెలీందిగాదు. కాని ఇది వొట్టి చావు కాదే, దారుణహత్య, ఈ పందికొక్కు ఒక వార్ధక్యం వచ్చి, తిండిలేక ఎండి చావలేదు. ఏ తాచో, జెర్రో, మింగి చావలేదు. తినగూడనిది తినో, చెయ్యగూడని పని చేసో చావలేదు. ఎవరో దుర్మార్గులు నిండు ప్రాణాన్ని నిలువునా తీశారు. చంపి లాగి అవతల పారేశారు—మిగిలిన పందికొక్కులూ, ఎలుకలూ కనపడ్డారుగా ఉండగలందులకు!...

## ౨

మామ ఆరాత్రి ఎన్ని వీధులు తిరిగాడో, ఎంత అలిసిపోయినాడో లెక్కలేదు. తిరిగిన వీధే తిరిగినట్టుంది. చూసిన దీపాలే చూసినట్టుంది! అక్కడక్కడా పెంటపోగుల్లో తినటానికేదైనా దొరికింది. కాని అది తిండా? ఎబ్బె, రెండు రోజులా తిండి తింటే కాళ్లు పీక్కపోయి నీరసం రాదూ?

మామ కిప్పుడు మరొక దిగులుకూడా పట్టుకుంది. ఈ మహారణ్యంలో తన చెల్లెలూ, పిల్లలూ ఎక్కడున్నారో తెలుసుకోవటం సాధ్యమా? వొట్టిమాట. ఎవరన్నా అడిగి కనుక్కుందామన్నా, ఎవర్నని అడగటం, ఎవరు చెబుతారు?

మామప్రశ్నకు సమాధానంగా రోడ్డు అవతలపక్క కిచకిచమని శబ్దమయింది. మామకు ఒక్కసారిగా ప్రాణం లేచి వచ్చి అటువేపు పరిగెత్తాడు. అక్కడ ఒక ఆడఎలుక రోడ్డుపక్క కందకంలో ఏదో ఏరుకుతింటూ కనిపించింది.

“ఓహోయ్,” అన్నాడు మామ, పొలాలమీద కేక వేసే అలవాటుచొప్పున.

ఆడఎలుక తలఎత్తి మామకేసి కోపంగా చూసింది. ఈ మోటుతనం ఆవిడ కర్థంకాలేదు.

“ఏమున్న దక్కడ తినటానికి?” అన్నాడు మామ దగ్గిరికొస్తూ.

“దేవుడు నీకు ముక్కు, మీసాలూ ఇవ్వలేదా?” అన్నది ఆడఎలుక.

“దేవుడిచ్చిన నా ముక్కుకు తిండివాసనే తగల్టం లేదు,” అన్నాడు మామ, చుట్టూ మూచూసి చీదరించుకుంటూ.

“పల్లెటూర్లల్లే ఉందే?”

“ఏమయితే?”

“మరేంలా. మట్టివాసన.”

“నాదగ్గిర మట్టివాసనయితే, నీదగ్గిర రోగంకంపు.”

మామ మాటపడేవాడు కాడు. ఇచ్చకాలు అసలే ఎరగడు.

ఆ ఆడఎలుక ఒయ్యారంగా ఒళ్లు తిప్పి పరిగెత్తటం ప్రారంభించింది. ఎందుకో మామ దానివెంట పడ్డాడు. ఆ ఆడఎలుక దగ్గిర ఏం గమ్మత్తు— ఏం చమక్కు— ఉన్నదో గాని మామకు ఆ క్షణంలో ఆమెను అందుకుని వొళ్లంతా తన మీసాలతో నిమరబుద్ధి అయింది.

ఆడఎలుక పరిగెత్తి పరిగెత్తి చివరకు ఒక ఇంటి కలుగులోకి దూరింది. మామకూడా దానివెంట దూరాడు. పాపం. మామకు ఒళ్ళంతా డొక్కుపోయింది. కారణమేమంటే మామకు మట్టికలుగులు అలవాటు గాని గోడ కలుగు లలవాటు లేదు. అదీకాక మామ కాస్త దేహపుష్టి కలవాడేమో ఆ కలుగు కొంచెం ఇరుకనిపించింది.

లోపల ఒక పెద్ద గది. దాన్నిండా పాత చెక్కసామానూ అదీ ఉన్నది. గదినిండా మడమలోతు దుమ్మున్నది. మామకు ఆ దుమ్ము చూడగానే ప్రాణం లేచివచ్చినట్టయింది. ఈ మహాపట్నంలో మళ్ళి మట్టి అన్నది కనిపిస్తుందని మామ అనుకోలా.

ఆ గదిలో సుమారు పది పన్నెండు ఎలుక లున్నట్టు మామ అంచనావేశాడు. పిల్లలు తప్ప పెద్దవాళ్ళంతా మామచుట్టూ మూగారు. అందరూ మామను అంతదూరంలోకి వచ్చి వాసనచూసి తలలు అడ్డంగా తిప్పారు. వాళ్లేమనుకుంటున్నారో మామకు అర్థంకాలేదు. వాళ్లల్లో ఒక్కరికైనా మంచి ఏపైన వొళ్లు లేదు. ఒక్క ఆడది కూడా పట్టుమని నలుగురు పిల్లలకు కడుపు

ండా పాలివ్వలేదు. కొందరికి ఒంటి నిండా వెంట్రుకలైనా లేవు. ఎవరికీ ఏ జన్మానా కడుపునిండా తిండి తిన్న అదృష్టం ఉన్నట్టులేదు. పిల్లలసంగతి అడగనేఅక్కర్లేదు. సుష్టుగా తిండి తినవలసిన పిల్లలు చచ్చిపోయిన బొద్దింకలనూ, కొయ్యముక్కల్నీ, దూది ఉండల్నీ, దారపోగుల్నీ చప్పరిస్తున్నారు. ఇటువంటి గర్భదారిద్ర్యం మామ ఊహించుకుని అయినా ఎరగడు.

మామ కక్కడ ఒక్క క్షణమైనా ఉండ బుద్ధి కాలేదు.

"మిమ్మల్ని చూస్తే నాకడుపు తరుక్కుపోతోంది. గౌరవనీయులైన ఎలుకలు ఎట్లా బతుకుతాయో తెలుసుకోవాలంటే మా పొలాలకి రండి," అన్నాడు మామ.

"మీ పొలాలసంగతి మేమూ విన్నాం. వెధవపొలాలూ, వెధవ మట్టిబతుకు! ఇక్కడ ఎటువంటి గోడ్లు, ఎటువంటి ట్రాములు, బస్సులు, దీపాలు! మోటారుకార్లు బయ్యిమని పోతూంటాయి. ఎంతెంత పెద్ద దుకాణాలు! ఎంత అడావుడి!" అన్నది పట్నంఎలుకల్లో ఒకటి.

"మీ పట్నవాసం తగలబడ! తినేటందుకు తిండిలేకపోయింతరువాత ఇవన్నీ దేనికి?" అన్నాడు మామ.

"మీ పల్లెటూరాళ్లు మొద్దులు. పట్టపగలు నీబోటివాడు అట్లా వీధిలో కెళ్తాడంటే ఏ కారుకిందో పడి ఊరుకుంటాడు. మేం ఎంత చలాకీగానో ఉండాలి. మేం తిండి దొంగిలించాలంటే ఎన్ని యుక్తులు పన్నాలి! ఎన్ని మెళుకువలు తెలియాలి! ఇక్కడివాళ్ల మనస్తత్వాన్నీ, అలవాట్లనూ కాచి వడబోశాం. అదే మా విజ్ఞానం."

మామ నిర్ఘాంతపోయినాడు. తిండి దొంగిలించటమన్నమాట వినేటప్పటికి మామకు చెప్పరాని విస్మయం కలిగి మిగిలిన మాటలు చెవికెక్కలేదు.

"తిండి దొంగిలిస్తారా? ఇదా ఇక్కడి బతుకు?" అన్నాడు మామ.

"మీరు పొలాల్లో ఏం చేస్తారట్లా?"

"మేం పని చేస్తాం. పొలాల్లో రాలిన గింజలన్నిటినీ భద్రంగా చేర్చవేసి దాచుకుంటాం. ఏ గోజు మా కలుగులో అడుగుపెట్టినా వారంగోజుల గ్రాసం సునాయాసంగా దొరుకుతుంది. దొంగతనమా? ఛీ!"

"ఇక్కడ మాకు నిలవలూ గిలవలూ జాంతానై. మేం ఇవాళ ఇక్కడుంటాం. ఇక్కణ్ణుంచి వెళ్లగొడితే రేపింకోచోట ఉంటాం. మాకు దాచుకునేటందుకు ఉండనూ ఉండదు, చోటూ ఉండదు."

"అయ్యో, మీ బతుకు గురించి వింటుంటే నాకు కడుపు తరుక్కుపోతున్నది," అన్నాడు మామ.

ఒక పోకిల్లాపిల్ల ముందుకొచ్చి, "కోతలు కొయ్యమాక! దర్జాగా పట్నవాసం అనుభవింతామనే నువ్వు ఇక్కడికొచ్చావ్. అంత బాగా బతికినవాడివైతే ఆపొలాల్లోనే ఉండకపోయావా? మీ జన్మలో ఎప్పుడన్నా అనుభవించగలరా? నేను నా కాస్త జీవితంలో రేడియోవెనక దాక్కుని ఒక నాటకమల్లా విన్నా, ఎన్నోసార్లు సినిమాలు చూశా, మంచి ఖరీదైన టిస్యూచీరెలు తిన్నా, ట్వీడ్‌సూట్లు తిన్నా. కాస్త పైత్యం చేస్తుంది కాక—ఏం చేస్తే? తింటే ట్వీడ్‌సూట్లే తినాలి!" అన్నది.

"పట్నవాసమంటే ఏమిటో తెలీక బయలుదేరా. తెలిసిందికనక వెంటనే వచ్చినదారి పడతా. మిమ్మల్నందర్నీ చూస్తుంటే నేనుకూడా మీలాగేఅయిపోతానేమో అనిపిస్తున్నది. నాకల్లా ఒక్కటే విచారం— మా చెల్లెలు నిక్షేపంలాంటి పొలాలు వొదులుకుని ఇక్కడ ఈ దిక్కుమాలిన నరకం అనుభవిస్తున్నదే అని. ఇంకా దానికోసం వెతుకుదామనుకుంటున్నా. ఇక వెతకను. నాదారిన నేను మళ్లీ మాచోటికి పోతా. నాతోబాటు ఎవరన్నా వస్తే రండి."

మామ అందరివంకా చూశాడు. ఎవరూ ఈ ఆహ్వానాన్ని స్వీకరించలేదు. వీళ్ళకి పట్నవాసంలో ఏదో రుచి కనిపించి ఉండాలి. తాను ఊహించుకోలేని ఆనందం ఇందులో ఏదన్నా ఉందో, లేక వీళ్ళ బుద్ధులు వక్రించాయో మామకు అర్థం కాలేదు. వీళ్ళకు నిలకడ అయిన జీవితం లేదు. గాలికి కొట్టుకుపోతారు. దొంగతనం చేసి పొట్ట నించుకుంటారు. అంటే పరిసరాలకు విరోధులుగా ఉంటారన్నమాట. అతిథి వచ్చినా, అభ్యాగతి వచ్చినా, చుట్టం వచ్చినా, పక్కంవచ్చినా ఇంత పెట్టలేరు. వీళ్ళకి జీవించటమే తెలీకుండాపోయింది.

ఈవిధంగా విచారిస్తూ మామ తాను వచ్చిన కలుగులోకి మళ్ళీ ప్రవేశించి అతి జాగ్రత్తగా బయటికి వచ్చి చూచేసరికి అప్పుడప్పుడే తూర్పు తెల్లవారుతున్నది. రోడ్డుమీద బళ్ళ అలికిడీ, మనుష్యుల అలికిడీ జాస్తి అయింది.

మామ ఎటుపోదామని చూస్తుండగా ఇంకో ఎలుక—ఎవరో ఆడకూతురు—పరిగెత్తుకుంటూ దగ్గిరకొచ్చి మామను మూతిపెట్టి పొడిచి, "అన్నయ్యా!" అన్నది.

"చెల్లీ! నువ్వేనా? ఎంత అదృష్టమే? నువ్వు కనిపించవని నిరాశ చేసుకున్నా. మళ్లీ ఇంటికి పోదామనుకుంటున్నా," అన్నాడు మామ, ఆనందపారవశ్యంతో.

"ఎప్పుడొచ్చావు? అంతా కులాసాగా ఉన్నారా? ఇంటికి పోదాం రా!" అంటూ చెల్లెలు దారి తీసింది. పట్న జీవితాన్ని గురించి కలిగిన విరక్తియావత్తూ మరిచిపోయి చెల్లెలివెంట బయలుదేరాడు."

(ఇంకా ఉంది)






శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

3

"నయమేనే, అమ్మాయ్! మంచి ఇల్లే సంపాదించావే మెటుకు?" అన్నాడు మామ, చెల్లెలి వెనకే ఆవరణలో ప్రవేశించి తలఎత్తి ఇంటికేసి చూస్తూ.

"ఏదో. ఫరవాలేదు కొత్త ఇల్లూ! లైట్లూ, కొళాయీ, మేం ఉండటానికి మంచి అటకా - కొయ్యదికాదు, సిమెంటుది - ఉన్నాయీ! చుట్టూ బోలెడంత ఆవరణా! పిల్లలు తిరగటానికీ, ఆడుకోవటానికీ మెట్లకింద చిన్న చీకటికొట్టూ! ఫరవాలేదు, అన్నది చెల్లెలు, తానున్న యింటిని తానే అట్టే పొగడుకోవటం భావ్యం కాదని.

"ఈ పట్నంలో కొన్ని ఇళ్లు చూశాను, చూడూ" - అని ప్రారంభించాడు మామ.

"ఇదేం, సులభంగా దొరికిందనుకున్నావా, అన్నయ్యా? పునాదులు తవ్విన రోజునుంచీ మా ఆయన రోజూ వచ్చి పని ఎంతవరకయిందీ చూసిపోలేక చచ్చాడనుకో. ఏం లేదు. తీరా ఏమరుపాటున ఉన్నామో, ఫుటుక్కున ఎవరోవచ్చి తిష్ఠ వేస్తారు. ఆ తరవాత ఏమనుకుని ఏం లాభం?... మరేం లేదులే - ఇంటాయన గురకపెడతాడు కాస్త. దా, ఇట్లా పోదాం. ఏమిటో చెబుతున్నా.. ఆఁ! ఇల్లు కట్టగానే ప్రవేశించామయ్యా, అంతటితో ఏమయిందీ? ఇల్లుకట్టిన ముండాకొడుకు ఇంట్లోకి వచ్చెయ్యగూడదూ? రాలా! పోనీ ఇంకొకరికి ఇవ్వలా ఇల్లు అద్దెకడిగిన వాళ్ళని, రెండువే లిస్తావా? రెండేండ్ల అద్దె అడ్వాన్సు ఇస్తావా? నల్లసొమ్మెంత ఇస్తావు? ఎంతకు రసీదిస్తావు? అని బేరాలు మొదలెట్టాడు. ఎన్నాళ్ళకీ ఇంట్లో కెవరూ వచ్చారు కారు. పిల్లలూ మేమూ అల్లాడిపోయామనుకో!"

"అదేమే?" అన్నాడు మామ, ఆశ్చర్యంతో.

"అట్లా అంటావేమిటన్నయ్యా? మేం ఏం తిని బతికేట్టూ? ఇంకో ఇంటికి పోదామా అంటే ప్రతి కొంపలోనూ తొక్కిడే నయివాయె. అప్పటికీ కొంతకాలం ఒక ఇరుకు కొంపలో ఉన్నాం. మాతోపాటందులో ఇంకా పన్నెండు కాపరాలు. ఎవరికీ పొట్టనిండా తిండిలేదు. మాలో మేం పోట్లాడుకునేవాళ్ళం. మా పిల్ల లేదన్నా తెచ్చుకుంటే ఇతరపిల్లలు ఎగబడటమూ, కొట్లాటలూ, శాపనార్థాలూనూ. చివరకు మాగుట్టు దాగిందికాదు. ఇంటివాళ్లు మా అలుసు కనిపెట్టి చుక్కలపిల్లి నొకదాన్ని తెచ్చారు. అది కాస్తా నా మనవణ్ణి -" అంటూ చెల్లెలు కంట నీరు పెట్టుకుంది.

"ఊరుకో పిచ్చిదానా! నీ మచ్చలపిల్లి నిమిత్తమాత్రం అన్నింటికీ ఆ భగవంతుడే ఉన్నాడు. నా కాశ్చర్యమేమంటే ఈ మహాపట్నంలో మనవాళ్లు పరువు మర్యాదలతో పనిచేసుకుని ఎందుకు బతకలేరూ అని! ఇంతకుముందు మనవాళ్ళని కొందర్ని చూసి మాట్లాడాగదా, వాళ్లు దొంగతనం చేసి పొట్టపోసుకుంటారుట. ఇదేం ప్రారబ్ధం?" అన్నాడు మామ.

"నువ్వా పాత వేదాంతం చెప్పకన్నయ్యా ఎవరు దొంగతనం చెయ్యంది? అంతా దొంగతనమే. ఇంటాయన ఇంట్లో అద్దెకున్నవాళ్ళను దోస్తాడు. అద్దెకున్న

వాళ్లు దుకాణం పెట్టి ఊళ్ళోవాళ్ళను దోస్తున్నారు. ఇక్కడ ఎవరిబతుకు వారు బతకటాని కున్నదనుకున్నావా ఏం? దొంగతనానికే శ్రమపడాలి," అన్నది చెల్లెలు.

"అటువంటప్పుడీ పట్నవాసం చెయ్యక పోతే ఏమీ అని," అన్నాడు మామ - చాతయితే దానికి సమాధానం చెప్పమన్నట్టుగా.

"అట్లా అనకులే, అన్నయ్యా. ఇక్కడున్న ఆనందం ఇక్కడుంది. ఇక్కడి జీవితం అర్థం చేసుకుంటే ఇందులోనూ తెలివితేటలూ, మెళుకువలూ లేకపోలేదు. ఇప్పుడీ ఇంట్లో మే ముంటున్నామంటే మాకు ఒక వానబాధ ఉందా, వరదబాధ ఉందా? పొలాలు దున్నటం, నీళ్లు పెట్టటం, ఈ అడావుడి అయిపొయ్యేదాకా మనం అక్కడా అక్కడా తలదాచుకోవటం - ఈ బాధ లేవీ లేవు. ఏడాది పొడుగూతా ఉన్నచోటినుంచి కదలక్కర్లేదు."

"అటువంటి జీవితం ఏం జీవితమూ అంటా! ఇవాళ్ళల్లేనే రేపూ అయితే అందులో విశేష మేమిటి? ఒకదాని వెనక ఒకటి చక్రంలాగా తిరిగివస్తుంటే ఆనందం గాని."

"ఇక్కడమాత్రం జీవితంలో మార్పు లేదనుకున్నావా? ఉంది. రోజుకో కొత్త వింత జరుగుతుంది. అదేమిటో ముందుగా మనకు తెలీదు, అంతా సావకాశంగా వింటే నీకే తెలుస్తుంది."

"అక్కడే నాకు పేచీ!" అన్నాడు మామ. "ఏ క్షణాన ఏం జరుగుతుందో తెలీని బతు కేం బతుకూ? జన్మంతా విడ్డూరాలే అయితే ఎట్లాగూ అంటా!" ఆయన ఏవిధంగానూ పట్నవాసం ఒప్పుకోదలచ లేదని చెల్లెలు అర్థం చేసుకున్నది. స్వానుభవంవల్ల పట్నవాసంలో ఉన్న గమ్మత్తు ఆయనకే తెలుస్తుంది గదా అనుకున్నది.

ఇద్దరూ ఒకరివెనక ఒకరు వంటఇంటి తూముద్వారా లోపల ప్రవేశించారు. మామ ఇంటిగోడను గోళ్లతోనూ, మునిపళ్లతోనూ పరీక్షించి, "అమ్మోవ్, మా లావు గట్టిగా కట్టారే?" అన్నాడు.

"నే చెప్పలా? సిమెంటుతో కట్టారు. నల్లబజారులో సంపాదించిన డబ్బుతో నల్లబజారులో కొన్న సిమెంటుతో కట్టిన ఇల్లు," అన్నది చెల్లెలు.

"ఈ నల్లబజా రేమిటో తెలవటంలేదే?" అన్నాడు మామ.

"అది మీ బావ నడుగు. నాకాటే బాగా తెలీదు," అన్నది చెల్లెలు.

వంటింట్లో పొయిమీద నీళ్లు కాగుతున్నాయి. ఎవరూ లేరు. మామ అటూ ఇటూ తిరిగి బుట్టలో పెట్టిన కూరలు చూమూసి, "ఈ కూరలు ఎవరు తింటారబ్బా?" అన్నాడు.

"ఏం?" అన్నది చెల్లెలు.

"చెట్టునుంచి కోసి శానాళ్ళయినట్టుంటేనూ?" అన్నాడు మామ.

"సరేలే. ఇక్కడ అప్పుడెప్పుడు కోసిన కూరలుకూడానా?" అన్నది చెల్లెలు.

"మీ జన్మ చెడా, ఈ కూరలా మీరు తింటున్నారు?" అంటూ మామ ఇంకో మూలకు పరిగెత్తి ఒక గిన్నెమీదపెట్టి ఉన్న మూత పడగొట్టాడు. లోపలికి తొంగిచూశాడు.

"ఇదేమిటే చూట్టానికి నెయ్యల్లే ఉంది, ఏ వాసనా లేదూ!" అన్నాడు మామ.

"అది వనస్పతిగామాలు. ఇప్పుడదే అందరూ తినే నెయ్యి."

"ఛా!" అన్నాడు మామ. ఆయన వెనక్కు తిరిగిచూసేటప్పటికి అక్కడ చెల్లెలు లేదు. ఇంతలో ఎటు పోయిందా అని చూస్తుండగానే ఎవరో వంటింటిలోకి వచ్చి కెవ్వున అరిచారు.

"ఒసే, లక్ష్మీ! ఎలికే! చంపవే! దీన్నొగుబడా! భయంలేకుండా ఎట్లా చూస్తోందో! నేతిగిన్నెమీద మూత పడేసింది! నీ పొగరు చితకా! లక్ష్మీ, లక్ష్మీ! దబ్బున రావే!"

మామకీ గావుకేక లేమీ అర్థంకాలేదు. ఆయన ప్రశాంతంగా తప్పేలాల వెనక్కు వెళ్లి అక్కడ దాక్కునిఉన్న తన చెల్లెల్ని కలుసుకున్నాడు.

"ఏమిటే గడబిడ? ఎందుకు పారిపోయినావు?" అన్నాడు మామ.

"ఇంకా నయం! అడుగుల చప్పుడు వినపళ్ళా? అక్కడే గుడ్లు మిటకరించుకు నిలబడతావేం?...పద, ఆ మనిషి వెళ్ళిపోయింది. ఇప్పుడెప్పుడే మనం కదలటానికి లేదు, ఆ జాడీలచాటున దాక్కుందాం రా!"

ఇద్దరూ అలమారులోకి ఎగబాకి జాడీల చాటున దాక్కున్నారు. మామ ఇంకా ఆ నెయ్యిగురించే ఆశ్చర్యపడుతున్నాడు. పొలాలమీద అన్నాలు కట్టుకొచ్చేవాళ్లు తినగా మిగిలిన బాపతు అన్ని రకాల తినుబండారాలూ మామ రుచిచూసిఉన్నాడు. కమ్మని పేన్నెయ్యీ, వెన్నా, దంపుడు బియ్యం అన్నమూ, కూరలూ, పచ్చళ్లూ మామ ఎరుగును. చెట్టునకాచే వంగలూ, మిరపలూ, దోసలూ, గుమ్మళ్లూ, ఏ దశలో ఎటువంటి సువాసన కొడతాయో మామకు తెలుసు.

"ఇదేం కూరలూ! ఇదేం నెయ్యీ!" అనుకున్నాడు మామ.

కేకలు పెట్టిన మనిషి తిరిగి వచ్చింది.

"అదుగో ఆ తప్పాలాల చాటున దాక్కుంది, చూడవే, లక్ష్మీ!" అన్నదా గొంతే.

"ఇక్కడ ఏం లేదమ్మగారూ. పైన ఆ జాడీలవెనక ఏమన్నా చేరిందేమో."

మామ తన చెల్లెలికేసి చూశాడు. ఆయన కళ్ళల్లో చెల్లెలి కేదో మందహాసం కనిపించింది. జాడీలు కదిలిస్తారేమో అని గుండె పిచపిచలాడే చెల్లెలికి అన్న ఆనందం అర్థం కాలేదు. కాని మామ తన చెల్లెలంత ప్రాణభీతి కలవాడు కాకపోవటంవల్ల లక్ష్మి తెలివితేటలు మెచ్చుకోగలిగాడు.

"చావనీ!...తరవాత నే చూస్తాలే. నువ్వెళ్లి దబ్బున గ్లాసులు తోముకు రా. కాఫీ లందించాలి," అన్నది కేకలుపెట్టిన మనిషి. పనిమనిషి జాడీలు ముట్టుకోవటం ఆవిడ కిష్టంలేదు, తాను స్వయంగా నల్ల గుమ్మామను ఎదుర్కోవటం అంతకన్నా ఇష్టంలేదు.

"ఆ వాసన ఏమిటబ్బా?" అన్నాడు మామ, జాడీల వెనకనుంచి మూతి ముందుకు పెట్టి, మీసాలు కదిలిస్తూ.

"అది కాఫీలే! నువ్వివతలికి రా. మేమూ పిల్లలూ రోజూ అంతో ఇంతో కాఫీ రుచి చూస్తూనేఉంటాం" చిన్నవెధవ కాఫీ పొడే కొట్టేస్తాడు, అన్నది చెల్లెలు.

"మా లావు ఘాటుగా ఉంది. జబ్బు చెయ్యదుగద?" అన్నాడు మామ.

మరి కాస్సేపటికి ఇంటావిడ వంటింట్లోనుంచి అవతలికి వెళ్లిపోయింది.

జాడీల వెనకనుంచి అన్నా చెల్లెళ్లు బయటికి వచ్చారు. కిందపడ్డ కాఫీ చెల్లెలు కాస్త తాగింది. మామకూడా కొంచెం రుచి చూశాడు, "ఎబ్బె!" అన్నాడు.

చెల్లెలు కిందపడ్డ కాఫీపొడుం చేత్తోతీసి మొహాన రుద్దుకుంది. ఇద్దరూ కలిసి అటక మీదికి బయల్దేరారు.

## ౪

"ఓరీ, నువ్వట్రా, బైతుబావా! రా, రా! ఎప్పుడొచ్చావ్? ఏమిటి కథా? అంతా కులాసా? ఆమధ్య కురిసినవానలకు మీరంతా ఏమైనారో అని చాలా అనుకున్నాం," అన్నాడు పట్నం బావ.

"వానలసంగతి మీకూ తెలిసింది?" అన్నాడు మామ.

"ఆఁ మా యింటికి పత్రిక వొస్తుందిగా! ఇంటివారబ్బాయి చదివి తల్లికి చెబుతుంటే విన్నాం," అన్నాడు బావ.

పట్నంలోఉండే సౌకర్యాలు కొన్ని లేకపోలేదని మామకు తట్టింది.

"అదీకాక, ఇంట్లో రేడియో ఉందారొ, చిట్టి విని చెప్పింది."

పిల్లలంతా ఒక మూలచేరి కొత్త బంధువును వింతగా చూస్తున్నారు.

ఒకపిల్ల మూతి చిట్లించి, "మట్టివాసన," అన్నది. మిగిలిన పిల్లలంతా ఒక్కసారి నవ్వి మళ్ళీ అంతలో మానేశారు.

"ఎందుకర్రా అట్లా చూస్తారూ? మీ బైతుమామయ్య.. అదుగోరా, ఆ ఆరుగురూ మా మనమలూ, మనమరాళ్ళూనూ. మిగిలినవాళ్లంతా మా పిల్లలు. ఈ ముగ్గురూ మా అల్లుళ్ళు, నాళ్లిద్దరూ కోడళ్ళూనూ. కోడళ్లిద్దరూ కొద్దిరోజులకిందే వచ్చారు. ఇంకో పిల్లా పీచూ లేదు. ఇట్లా ఉన్నాం," అన్నాడు బావ.

మెల్లి మెల్లిగా పిల్లలకు కొత్త తీరింది. వాళ్లు అటూ ఇటూ పరిగెత్తసాగారు. ఇద్దరు పిల్లలు మూల నున్న ఉల్లిపాయముక్కల మీదికి పరిగెత్తుతూ ఒకరి నొకరు తోసుకున్నారు. ఒక పిల్లవాడుమాత్రం తల్లిదగ్గరికి వచ్చి మూతి నున్న కాఫీపొడరు నాకసాగాడు.

"ఉండరా గర్భాత్తుడా! మామయ్యతో కాస్సేపు మాట్లాడనీ... చూసిన్నయ్యా, పిల్లలందరూ వట్టి అల్లరివాళ్లు. వాళ్లీ బస్తీలో బాగా మెదిగి అతి తెలివితేటలు సంపాయించారు. మా చిట్టి ఉందా? అది ప్రతిరోజూ సినిమాకు పోతుంది. తెల్లారకముందే పిల్లలంతా కాఫీహోటలుకు తయారు గదా! ఏ అపాయం వస్తుందోనన్న భయంగాని భక్తిగాని కొంచెమైనా లేదు. ఆ మాటని వాళ్లపొట్ట వాళ్లు పోసుకుంటాగా అంటే అదీ లేదు. రోజూ ఉల్లిపాయలు నే తెచ్చిపెట్టాలి. ఇంట్లోవాళ్లేదన్నా చేసుకుంటే మిట్టమధ్యాన్న మయేది, పట్టపగలయేది నే వెళ్లితెచ్చిందాకా చిందు లేస్తారు. నానా అగచాట్లూ అనుకో, అన్నయ్యా!" అన్నది చెల్లెలు.

మామ కిదంతా ఏమీ బాగాలేదు. అందుచేత ఏమీ అనలేదు. తన అధికారంలో పిల్లలయేది పెద్దలయేది అందరూ చచ్చినట్టు కష్టపడి ఎవరితిండి వారు వెతుక్కోవలసిందే. సోమరితనమూ, లేనివి కావాలని మారాం చెయ్యటమూ ఆయన ఎంతమాత్రం సహించడు.

ఇంతలో ఎక్కడినుంచో టంగ్, టంగ్మని గంటలు వినపడ్డాయి. మామ ఈ మోతను ఆశ్చర్యంగా ఆలకించసాగాడు.

కాఫీపొడి ఇష్టమైనవాడు ఎగతాళిగా, "అదుగో, మామయ్యా దడుచుకున్నాడు! పల్లెటూరిమొహం! బైతుమామయ్య! బడ్డుమామయ్య! గడియారం గంటలు




కొడితే, చైతుమామ భయపడ్డాడూ!" అని పాటగా పాడసాగాడు.

మామ వాడికేసి చాలా కోపంగా చూశాడు. కాని వాడు లక్ష్యపెట్టక, "నిజం చెప్పు, మామయ్యా! నువ్వు భయపడ్డావా లేదా? నీకురాపాలు బందయినయ్యా లేదా?" అన్నాడు.

"అవునురా! గుండె ఆగిపోయిందంటే నమ్ము!" అన్నాడు మామ వెటకారంగా.

"అట్లా ఒప్పుకో!" అన్నాడు బాలుడు గర్వంగా.

వాడట్లా మాటాడటంకంటె కూడా, వాణ్ణి తల్లీ తండ్రీ మందలించకపోవటం మామకు చాలా ఆశ్చర్యంగా కనిపించింది. పైపెచ్చు పట్నంబావ, కొడుకుప్రజ్ఞకు మెచ్చుకుంటూ, విరగబడి నవ్వాడు, కళ్లనీళ్లు కారేదాకా.

మామ సామాన్యుడు కాడు. రెండుసార్లు నాగుపామునోట పడ్డంతపని అయి తప్పించుకున్నవాడు. ఒక్క పాముతే కాదు, ఏప్రమాదమైనా సరే అంతదూరాన ఉండగానే పసికట్టగలప్రజ్ఞా, ఎంతప్రమాదంలో కూడా తొణకకుండా కర్తవ్యం ఆలోచించే నిబ్బరమూ మామకుండ బట్టే మామ తనవాళ్ళకు నాయకుడుగా వ్యవహరించగలుగుతున్నాడు. ఈ పట్నంలో ఎవరి చూరులో నో చేరి తన రక్త బంధువులే ఇంత వెకిలి వాళ్లయిపోవటం మామకు చాలా కష్టం వేసింది.

పట్నంబావ నవ్వు సంబాళించుకుని, "ఒసే, చిట్టీ! పిల్లి అరుపు మామయ్యకు వినిపించు... అచ్చగా పిల్లి అనుకోవలిసిందేరా!" అన్నాడు.

మామ నిర్ఘాంతపోయినాడు. ఎలుక పుట్టక పుట్టి పిల్లిని అనుకరించట మేమిటో మామకు అర్థంకాలేదు. ఈ పట్నంబావ తన పిల్లలకు ఈపాటైనా జీవితపు విలవలు లేకుండా ఎట్లా చెయ్యగలిగాడో మామ ఊహించలేకపోయినాడు.

ఈలోగా చిట్టి, "మావ్, మావ్," మని అరవటం మొదలు పెట్టింది. మామకు వాంతి అయినంతపని అయింది. ఆయన మీసాలూ రోమాలూ నిక్కబొడుచుకున్నాయి. కళ్లు ఎర్రబడ్డాయి. ఇందులో మరో అభాసేమంటే చిట్టిఅనుకరణ ఏమాత్రమూ సరిగా లేదు. పరమమూర్ఖులు తప్ప అది పిల్లి అరుపనుకోలేరు. తన చెల్లెలి కుటుంబానికంతకీ పూర్తిగా మతులు పోయి ఉండాలి.

తన మేనగోడలు— సాక్షాత్తూ తన చెల్లెలు కడుపున పుట్టిన బిడ్డ— తనజాతికి గర్భశత్రువైన పిల్లిని అనుకరించడం చూసి మామకు కలిగిన ఆగ్రహానికి సాదృశ్యం ఒక్కటే ఉంది— ప్రహ్లాదుడు "హరి" అంటే హిరణ్యకశిపుడికి కలిగిన ఆగ్రహం.

"ఆపు! చాలించు!" అని అరిచాడు మామ. మిగిలినవాళ్లు, చిట్టితోసహా, నివ్వెరపోయినారు. బాలుడుమాత్రం కేరింతాలు కొడుతూ, "మామ భయపడ్డాడే! చైతు మామ భయపడ్డాడే! చైతుమామ భలే బాగా భయపడ్డాడే!" అని పాడుతూ నృత్యం చెయ్యసాగాడు.

"నువ్వు నోరుముయ్యరా, ఫుంఢాఖోర్," అన్నాడు మామ ఓర్పంతా నశించి.

"ఏం, బావా? ఏమిటట్లా కంగారు పడ్డావు?" అన్నాడు పట్నంబావ.

"ఇంకా అడుగుతున్నావుట్రా? ఆ ముండకేం తెలుసు? వీరు దేనికి హర్షిస్తే ఆపనిచేస్తుంది. పెద్దవాళ్లు, మీకెందుకు బుద్ధి లేదు? అనుకరించాలంటే పిల్లులా? ఆపాటి ఆత్మగౌరవం, ఆత్మాభిమానం ఉండక్కర్లా? ఎబ్బే!" అన్నాడు మామ.

ఆ పైన చర్చ జరిగింది. పట్నంబావ అనుకరణ ఒక కళ అన్నాడు. కళకు ప్రతిబంధకాలూ, కళలో సంకుచితత్వమూ ఉండకూడదన్నాడు. జీవితపువిలవలు దాని పైన ఆరోపించరాదన్నాడు. కళకొరకే కళ అనికూడా అన్నాడు. చైతుమామకు కళ అనే మాటే తెలీదు. పట్నంబావ చెప్పేదంతా నోరుతెరిచి విని, "అట్లా అయితే ఇటువంటి కళలు చాలా తుచ్ఛమైనవి. వాటిని వర్జించాలి," అన్నాడు.

ఈ వాదనలో బాలుడూ, వాడి తమ్ముడూ, చిట్టికూడా ప్రవేశించారు.

"ఈ పట్నంలో మీ పాలాల పద్ధతులు సాగవు. ఇక్కడ పిల్లులు మాకు శత్రువులు కావు. పిల్లులు పోలకపోసిన వస్తువులు మాకు అందుతూ ఉంటాయి. వాటిని మేం శత్రువులుగా పరిగణించం," అన్నాడు బాలుడు.

వెంటనే వాడి తమ్ముడు అందుకు "పిల్లంటే మాకు భయమనుకున్నావా ఏం. నేనొక పిల్లిని బెదరగొట్టా. నన్ను చూసి ఆ తెల్లపిల్లి దడుచుకు పారిపోయింది. అమ్మ నడుగు కావలిస్తే," అన్నాడు.

ఈ వింతసంఘటనగురించి అందరూ ఒక్కసారి గోలగా మామకు చెప్పారు. ఇది నిజంగా జరిగిన సంఘటనే అని మామ గ్రహించి, బస్తీలో అటువంటి పిల్లులు కూడా ఉంటాయి కాబోలనుకున్నాడు.

కాని ఆయనకు తన చెల్లెలు చెప్పినమాట జ్ఞాపకంవచ్చింది. "నీ మనవడుసంగతి పిల్ల లెరగరా?" అన్నాడాయన చెల్లెలితో.

"ఎందుకు పిల్లల్ని భయపెట్టటమని చెప్పలేదు. ధైర్యసాహసాలు లేకపోతే పిల్లలు చెడతారని మీ బావ అంటాడు."

"మీ ధైర్యసాహసాలు మండా!" అన్నాడు మామ.

పెద్దవాళ్లు తమలో మాట్లాడుకుంటున్న సందడిలో పిల్లలందరూ చేరి పిల్లి ఆటలు ఆడుతూ, పిల్లి అరుపులు అరుస్తూ, పిల్లి మొగ్గలు వేస్తున్నారు. మామ ఇదంతా ఒక కంట కనిపెడుతూనే ఉన్నాడు.

(ఇంకా వుంది)




ఎండ ఎక్కుతున్న కొద్దీ అంతా నిద్దర్లకు పడ్డారు. ప్రయాణపు బడలికా, ఇంటినుంచి బయలుదేరినప్పటి నుంచీ కలిగిన మానసిక సంక్షోభమూ వల్ల మామ అందరికన్న ముందే కన్ను మూశాడు. కాని మామకు సుఖమైన నిద్ర పట్టలా. ఇంటినిండా ఏమిటో దిక్కుమాలిన చప్పుళ్లూ, కేకలూ, అరుపులూ, రేడియో మోతా, రోడ్డుమీద మోటార్ల హారన్ చప్పుళ్లూనూ. ఎన్నడూ కలలు ఎరగని మామకు ఇవాళ ఒకటే కలలు – పీడకలలు. అందులో రకరకాల పిల్లులు. ఒక మచ్చల పిల్లి తనదగ్గిరికి వచ్చి ముద్దు పెట్టుకున్నట్టూ, తనకా పిల్లిమీద మోహం కలిగినట్టూ, ఇంతలో అది నోరు భయంకరంగా తెరిచి తనను మింగబోయినట్టూ, ఒక కల వచ్చింది మామకు. ముచ్చెమటలు పోశాయి. వణుకుతూ నిద్రలేచాడు.

"ఏం, మామా? ఇంకా నీకు పొద్దూలా ?" అన్నది ఒకపిల్ల.

"ఇంత వెలుతురుంటేనే ?" అన్నాడు మామ కళ్లు చికిలిస్తూ.

మేనగోడలు నవ్వి, "ఇది ఎలెక్ట్రిక్ దీపాల వెలుతురు లే, నిద్రలే, కాస్సేపట్లో అందరం బయలుదేరుతున్నాం," అన్నది

"ఎక్కడికి ?" అన్నాడు మామ.

"ఎక్కడి కేమిటి ? పట్నంమీదికి"

మామకు ఆకలేస్తున్నది చెల్లెలికోసం వెతికాడు చాలామంది ఒక మూలచేరి అవీ ఇవీ తింటున్నారు.

## శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

"ఏం కావాలన్నయ్యా? ఇది మధ్యాన్నం ఎవరో మనింటికి వస్తే తెప్పించిన బజ్జీ. పనిచేసే లక్ష్మిముండ బద్ధకస్తురాలు. దగ్గిరహోటల్లో తెచ్చింది. ఇంకా నాలు గడుగులు వేస్తే మంచిహోటలున్నది. ఎన్నిసార్లు చివాట్లు పెట్టినా అది వినిపించుకోదుగా. పనివాళ్లకెంత పొగర నుకున్నావేమిటి ?" అన్నది చెల్లెలు.

తన చెల్లెలు, ఇంట్లో అద్దెకున్నవాళ్ళ పక్షాన మాట్లాడుతున్న సంగతి మామకు చప్పున అర్థంకాక, "ఎవరన్నా వస్తే నన్ను లేపకపోయినావుటే?" అన్నాడు.

పిల్లలంతా గొల్లున నవ్వారు.

పకోడీలూ, అరిటికాయబజ్జి ముక్కలూ, అప్పడంతునకలూ, కుళ్లిపోతున్న ఉల్లిపాయితొక్కలూ, సగం పండిన మిరపకాయముక్కలూ, ఇంకా ఏవేమిటో తినటాని కున్నాయి. మామ వాటిని బలవంతాన మింగాడు

తన చెల్లెలి కుటుంబంగురించి మామకు ఇప్పుడు అనేక కొత్త విషయాలు తెలియసాగాయి ఎవరి మాటా ఎవరూ వినిపించుకోరు "నా యిష్టం," అనేమాట ప్రతినోటా, ప్రతిక్షణమూ వినిపిస్తుంది. ప్రతిదానికీ ఒకరి నొకరు తీవ్రంగా విమర్శించుకుంటారు. వాళ్లు ఉదయం తనదగ్గిర తమ సహజధోరణి దాచిఉండాలి. ఇప్పుడు తాను పాతపడ్డాడు. వాళ్ల మధ్య ఉన్న అసలు సంబంధాలు బయటపడుతున్నాయి.

పట్నంబావ తల్లి, బహువృద్ధు. ఇవాళో రేపో అన్నట్టున్నది. ఆవిడవిషయం ఎవరూ ఆలోచించరు. ఆవిడ కేంకావాలో ఎవరూ కనుక్కోరు

"ఏమండీ, అత్తయ్యగారూ! పెద్దవారై పోయినారు," అన్నాడు మామ, ఆ ముసలావిడదగ్గిరికి చేరి.

"ఏదో, ఇంకా నూకలు చెల్లక మిగిలి ఉన్నాను...వాళ్ళంతా సుఖంగా ఉంటే చాలు. నా మాటకేం?" అన్న దావిడ.

"వాళ్లు మీకు సరిగా ఉపచారాలు చేస్తారా ?"

"ఉపచారాలా! ముసలిముండ ఇంకా పోదేమా అని చూస్తున్నారు. చూపట మేమిటి? పైకే అంటారు. ఇన్నేళ్లు బతక రాదుట - మా చిట్టి అంటుంది. ముస లాళ్లను రోజూ చూస్తుంటే అన్నం సయించదుట, ఆరోగ్యం చెడుతుందిట! లోకంలో అంతా నవయవ్వనులే ఉండి కన్నూ, మిన్నూ కానకుండా టింగురంగా అని తిరగాలిట. నాయనా, ఇట్లా మారింది కాలం. నా చిన్నతనంలో ఎటువంటి ఆపేక్షలుండేవి! ఎటువంటి అంతఃకరణ లుండేవి! ఇప్పుడు మొగుడూ పెళ్లాలకు పడదు. తల్లీ కూతుళ్లకు పడదు. అన్నాదమ్ములకు పడదు. ఎంతసేపూ, నేనూ, నాదీ!"

ముసలావిడ చెప్పినదాన్లో అతిశయం ఏమీ లేదనుకున్నాడు మామ. తన చెల్లెలి కూటంలో వయసుకూ, అనుభవానికీ బొద్దింక కాలి గోరు విలవ లేదు. పై పెచ్చు కుర్ర కారువాలకం చూస్తే ఎంత చిన్నవాళ్ళయితే అంత తెలివిగలవాళ్ళనీ, ఎంత అను భవం లేనివాళ్ళయితే అంత వివేకవంతులనీ అన్నట్టుంది.

"ఇదంతా మంచికిమటుకు రాలేదు," అనుకున్నాడు మామ.

"ఏం, బావా? తిండీ తిప్పలూ అయిందా? మనం అట్లా పార్కుకు పోదాం," అన్నాడు పట్నంబావ, మామతో.

పార్కంటే ఏమిటో మామకు తెలీదు. అక్కడేముంటుందని అడిగాడు మామ.

"అక్కడ మంచి దీపాలూ, చెట్లూ, మొక్కలూ అవీ ఉంటాయి. ఎనిమిదింటి కల్లా పార్కు తలుపులు మూస్తారు. ఆ తరవాత మనవాళ్లు చాలామంది చేర తారు. చాలా విషయాలు మాట్లాడుకో వచ్చు. ఇంకా టైముందిలే," అన్నాడు పట్నంబావ.

ఆరుబయట చెట్లు చామలమధ్య తిరిగి ఎన్నో ఏళ్లయినట్టుగా ఉండి మామ పార్కుకు పోవటానికి ఉబలాటపడ్డాడు.

ఇదే సమయంలో అందరూ ఒక్కసారి గొల్లుమన్నారు. మామకు గుండె ఆగిపోయిన ట్టయింది. ఆ క్షణానే మామకంటికి చిట్టి గోచరమైంది. దాని మూతంతా నెత్తురు!

"ఏం జరిగిందే? ఏం కొంపమునిగిందే!" అంటూ మామ ముందుకు వచ్చాడు.

అంతవరకు గొల్లుమంటున్నవాళ్లు మామ కేసి ఆశ్చర్యంగా చూశారు. వాళ్లు గొల్లు మన్నది భయాందోళనలతో కాదని వెంటనే మామ అర్థం చేసుకున్నాడు.

"ఏమిటన్నయ్యా? ఎందుకట్లా కంగారు పడుతున్నావు?" అన్నది చెల్లెలు.

"దాని మూతి! ఆ నెత్తురు!" అన్నాడు మామ. ఆయనకు నడివీధిలో ఉన్న పంది కొక్కు మళ్లీ కళ్లఎదట కనిపించినట్టయింది.

మామమాటలకు మళ్ళీ అందరూ గొల్లు మన్నారు.

"వీళ్లు నవ్వొచ్చినప్పుడల్లా ఎందు కిట్లా గొల్లుమని గుండె బెజారు చేస్తారో!" అను కున్నాడు మామ.

"అది నెత్తురు కాదన్నయ్యా! లిప్ స్టిక్కు! బయటికి పోవాలన్నప్పుడల్లా ఈ ముండ ఎట్లా సంపాదిస్తుందో ఆ లిప్‌స్టిక్కు సంపాదిస్తుంది. ఏనాడైనా అది దొరక్క పోయిందో అది బయటికి పోదు," అన్నది తల్లి, తన కూతుర్ని చూసి గర్వపడుతూ.

"ఎందు కదీ?" అన్నాడు మామ.

"ఎందు కేమిటి? అందానికి," అన్నది చెల్లెలు.

మూతి ఎవరో చితకగొట్టినట్టు చేసుకోవ టంలో అంద మేమిటో మామకు అర్థం కాలా.

"అది కాదు, మామా!" అన్నాడు బాలుడు ముందుకొచ్చి, ఏదో బయట పెట్టబోతున్న వాడి మొహం పెట్టి.

"ఒరే, బాలాయ్, నీ గుండెలు తోడుతా - అనవసరపు మాటలు మాట్లాడా వంటే!" అన్నది చిట్టి.

"పోవే, నువ్వంటే లెక్కేమిటీ!... అది కాదు, మామా. ఈ లిప్‌స్టిక్ దీని కెవరు నేర్పారో తెలుసా? అవతలివీధిలో ఒకతె ఉంది. చిట్టికి అదంటే గొప్ప. రోజూ సినిమాలకు పోవటం, అడ్డమైన స్నేహాలూ మరగటం, తెల్లగా తెల్లారి ఇంటికి రావటం చిట్టి కదే నేర్పింది. అది, అమ్మో, కాలాంతకురాలు. అది మూతికే కాదు గోళ్లకూ రంగేస్తుంది. వొంటినిండా పౌడరు వేసుకుని అంతదూరంనుంచి గుమాయిస్తూ ఉంటుంది. బలే కిలాడీ! -"

"పౌడ రేమిటి?" అన్నాడు మామ.

"తెల్లటి పొడి. అది వేసుకుని తాను తెల్లఎలికలాగా ఉన్నాననుకుం టుంది-"

"ఎందుకు తెల్లగా ఉండటం?" అన్నాడు మామ.

"తెల్లఎలిక అని అందరూ అనుకుంటే గొప్ప కాదు, మామా?"

"తెల్లఎలికేమిట్రా, నీ మొహం!" మళ్లీ అందరూ గొల్లుమన్నారు.

"నీకు తెలీదుగామాలు. తెల్లఎలిక లున్నాయిలే. యుద్ధం జరిగినప్పుడు విదేశీ సిపాయీలు కొన్నిటిని పట్టుకొచ్చారు. అందులో ఒకదాన్ని ఈ ముండ బుట్టలో వేసుకుని నలుగురు పిల్లల్ని కూడా కన్నది. అందులో రెండు ఆడపిల్లలు తెల్లవీ, రెండు మగపిల్లలు నల్లవీనూ. ఆ తెల్లఆడపిల్ల లంటే దానికి తగని ఇష్టం. మగపిల్లల్ని చూసేదే కాదు. చివరకు దానికి తగ్గశాస్తిఅయిందిలే. ఆ తెల్లపిల్లలు కాస్త పెద్దయినతరవాత తల్లిని ఎంత నీచంగా చూడాలో అంత నీచంగా చూశారు. వాళ్లకెంత పొగరు! మా నల్లవాళ్లు అంట రాదుట. తెల్లవాళ్లకోసం వెతుక్కుంటూ వెళ్లారు. ఏమైనారో తెలీదు."

మామ ఈ కథ విని నమ్మలేకపోయి నాడు. బాలుడు ఇంకా చెప్పకపోయి నాడు.

"చిట్టీ అదీ కలిసి సినిమాచూస్తారు. ఆ తరవాత తిండీ తిప్పలూ వెతుక్కుంటా రనుకున్నావా? పెద్ద దుకాణాలు కొల్ల గొట్టటానికి బయలుదేరుతారు. వాళ్లకెంత సేపటికీ పౌడర్లూ, స్నోలూ, లిప్‌స్టిక్లులూ, క్యూటెక్సులూ -"

"మా యిష్టం పో!" అంటూ చిట్టి గిరుక్కున తిరిగి ఎటో వెళ్ళిపోయింది.

"మనకు వేళయింది. పోదాం పద, బావా!" అన్నాడు పట్నంబావ.

## 6

మామ పార్కునుచూసి ఆశ్చర్యపడ్డాడు గాని ఆనందించలేదు. అక్కడి మొక్కలు చూసి మామ నిరాశకూడా చెందాడు. ఒక్క మొక్కా మామకు పరిచితమైనది కాదు. ఒక్కదాని వాసనా, రుచీ మామకు నచ్చలేదు.

"ఇవి అందంకోసం వేసినవి, బావా,

నారసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, నిర్బలత, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. ఏ. & కంపెని. "ఆయుర్వేదసమాజం"
పెరిదేపి-నెల్లూరు జిల్లా.

వీటివల్ల వేరే ప్రయోజనం ఏమీ లేదు," అన్నాడు పట్నంబావ.

ఒక చోట కొందరుచేరి కబుర్లు చెప్పుకుంటున్నారు. తాను కొత్తవాడు గదా అనుకుంటే పట్నం బావనుకూడా వాళ్లు పలకరించలేదు. అయినా ఎరిగిన మొహాలై ఉండాలి; పట్నంబావ వాళ్లకేసి దారి తీశాడు.

"మీ రేమైనా చెప్పండి, ఇవాళ జానపద చిత్రాలు తియ్యకపోతే ప్రొడ్యూసర్లు మట్టికొట్టుకు పోవలసిందే!" అన్నదొక లావుపాటి ఎలిక.

"ఇవెంత కాలం ఉంటాయో, చూస్తాంగా?" అన్నది మరొక సన్నని ఎలిక.

"ఇవి పోతే యింకో రకం పిక్చర్లు వస్తాయి. మునిగిపోయిం దేమీ లేదు," అన్నది పొట్టితోక ఎలిక.

"ఏమైనా మార్పు మంచిదే. నా చిన్నతనంలో దిక్కుమాలిన పౌరాణిక చిత్రాలు చూసేవాళ్లం. ఆ తరవాత సాంఘిక చిత్రా లన్నారు. ఇప్పుడు జానపద చిత్రా లంటున్నారు. ఈ విధంగా పిక్చర్లు మారుతుంటే తారలుకూడా కొత్తవాళ్లు రావటానికి వీలవుతున్నది," అన్న దొక గూని ఎలిక.

"నాకు మరేం అభ్యంతరం లేదుగాని ఈ జానపద చిత్రాలు చాలా అవినీతిని ప్రేరేపిస్తున్నాయి. సెన్సారు ఉన్నదన్నమాటేగాని -" అని మరొక ఎలిక అందుకున్నది.

ఈ సంభాషణలోకి పట్నంబావ ప్రవేశించాడు.

"ఏమైనా, ఆ వెనకటి పౌరాణిక చిత్రాలతో ఇవేవీ పోలవు లేద్దురూ! ఎంత హాయిగా ఉండేది అవి చూస్తుంటే," అన్నాడు పట్నంబావ.

"చిత్రాల్లో నీతి ఉండాలి. ఈ ప్రొడ్యూసర్లు డబ్బుదాహంతో తుక్కుచిత్రాలు తీస్తున్నారు మరీనూ!" అన్నది మొదటి ఎలిక.

"అయితే చూడండి, నాయన్లూ, మీరు ఏం మాట్లాడుకుంటున్నారో నాకేమీ అంతుబట్టటంలేదు". అన్నాడు మామ నిస్సంకోచంగా.

పట్నంబావ మాట్లాడితే ఆశ్చర్యపడని వాళ్ళు రైతుమామ మాట్లాడేసరికి కొయ్యబారినట్టయిపోయినారు.

"మేం సినిమాలను గురించి మాట్లాడుతున్నాం," అన్నది లావుపాటి ఎలిక. "ప్రొడ్యూసర్లు తమకు ఎక్కువ లాభం వచ్చే పిక్చర్లు తీస్తారా? మనం కావాలన్నవి తీస్తారా? మీరే చెప్పండి, తాతగారూ!"

తన యీడు ఎలిక తనను తాత అనేసరికి మామ ఒక్కసారి చకితుడైనాడు.

"ఎవరి లాభంకోసమో సువ్వారాట పడటా వెందుకు పోనిస్తూ. ఇంతమందీ తీరిగ్గాచేరి కూటికిగాని పోచికోలుకబుర్లు చెప్పుకోటానికేనా ఈ పార్కు పెట్టింది? చాలు, చాలు! ఎవరన్నావింటే నవ్విపోతారు." అన్నాడు మామ, మందలింపుగా.

మిగిలిన ఎలికలకు కోపంవచ్చి మామను ఛడామడా నాలుగు మాటలూ అన్నారు.

"ఇది పబ్లిక్ పార్కు! మా ఇష్టం వచ్చింది మేం మాట్లాడుకుంటాం. అచ్చగా తిండి గురించే పొద్దస్తమానం మాట్లాడుకునేటందుకు మేం పల్లెటూరి రైతులంకాం. మాకు కళలో ఆసక్తి ఉంది. మేం ఉన్నత సంస్కారం కలవాళ్ళం,"అన్నారువాళ్లు.

"మీ ఉన్నత సంస్కారం ఏడిసినట్టే ఉంది. ఎవరి సంస్కారమో తెచ్చి నెత్తినేసుకుని, ఎవరి సమస్యల్ని గురించో కిందామీదా పడుతూ - వెధవ జీవితాలూ, మీరూనూ!" అన్నాడు మామ, ఎట్టివాళ్ళనైనా మందలించే అధికారం కలిగిఉన్న ధీమాతో.

"ఏమిటి, మా కీ పీడ!" అని వాపోయింది బక్కచిక్కిన ఎలిక.

"పోదాం పద బావా," అన్నాడు పట్నంబావ, ఇక అక్కడ ఆట్టేసేపు నిలవటం భావ్యంకాదని గ్రహించి.

ఇవతలికి వచ్చిన తరవాత పట్నంబావ మామకు బస్తీ పద్ధతులను గురించీ, మర్యాదలను గురించీ చెప్పటానికి ప్రయత్నించాడు. బస్తీలో అట్లా ఒకరిజోలికి ఒకరు పోరు. ఊసుపోకకోసం నలుగురూ చేరినప్పుడు లోక వ్యవహారాలన్నీ మాట్లాడుకుంటారు. వాటి నెవరూ విమర్శించరు. పనికిమాలిన విషయాలను గురించి ఎంత బాగా తెలిస్తే అంత లోకజ్ఞానం ఉన్నట్టు.

ఈ సిద్ధాంతాలను మామ ససేమిరా ఆమోదించలేదు. ఇదేం సంఘమన్నాడు. తనకుమాలిన ధర్మం ఏమిటన్నాడు. కష్టపడి పనిచేసే ఎలికకు పోచికోలు కబుర్లు చెప్పేఅవకాశ మెక్కడఉంటుందన్నాడు.

ఇద్దరూ కలిసి అంతదూరం పోయేసరికి అక్కడ మరొక జట్టుచేరి మాట్లాడుకుంటున్నారు. వారిదగ్గరికి పోవటం పట్నంబావకు మంచిదికాదని తోచింది. కాని మామ వాళ్ళవేపే దారి తీశాడు.

ఈ కిందివిధమైన సంభాషణ వారి చెవుల పడింది.

"ప్రస్తుతంగల రాజకీయ సమస్యల్లో మనకు అతి ముఖ్యమైనది అధికాహారోత్పత్తి సమస్య అనటానికి సందేహం లేదు."

"నా చిన్నతనంలో ఇంత తిండి కొరత ఎరగం. రాత్రివేళ ఎటుపోయినా తట్టల కొద్దీ ఆహారం దొరికేది. నా అనుమానం ఈ ఆహార కొరత రేషనింగువల్ల ఏర్పడుతున్నదని."

"అట్లా అనకురే. రేషనింగు లేకపోతే పంటలు పండేచోట ఆహారసమృద్ధి ఉండొచ్చుగాక. ధనికుల ఇళ్ళల్లో ఆహారం పుష్కలంగా ఉండొచ్చుగాక. ఈ మహాపట్నంలో మనలో చాలామందిమి మాడిచచ్చేపోతాం."

"నువ్వంతా కంగారు కబుర్లు చెబుతావు! మా ఇంట్లో రోజూ దొంగబియ్యం కొంటారు. రేషనింగు పోవలసిందే!"

"నువ్వు ధనికవాదం చేస్తున్నావు. మన జాతిలో అధిక సంఖ్యాకులు బీదలకొంపల్లో తల దాచుకుంటున్నారు. గాని ధనికుల కొంపల్లో కాదు. నాకు బాగా జ్ఞాపకం. నా స్నేహితు డొకడు చాలా గొప్పవాళ్ళ ఇంట్లో ఉండేవాడు. ఎవరమూ తినని వెన్నలూ, రొట్టెలూ, ఆమ్లెట్లూ, మాంసాలూ తాను తింటున్నాననీ, బీరూ, విస్కీ, షాంపేన్ తాగుతున్నాననీ కోసేవాడు. అక్కడ వదిలి రారా అంటే విన్నాడు. కాదు... వాణ్ణి విషంపెట్టి చంపేశారు. వాడికోసం ఎన్ని పన్నాగాలు పన్నారో చెప్పలేం. ఆఖరు రోజుల్లో వాడు వెర్రెత్తిన వాడల్లే మృత్యుదేవత పిలుపు ఆలకిస్తున్న వాడల్లే కనిపించేవాడు. తరిచి తరిచి అడగగా, 'ఇవాళ మీసం వాసిలో చావు తప్పింది. మొన్నోరోజున కూడా చావుతప్పి కన్నులొట్ట పోయింది.' అని బయట పెట్టాడు. ఆఖరుకు చావనే చచ్చాడు. ఎన్నయినా చెప్పు అమాయిక పేద ప్రజలే మన మిత్రులు."

"ఎన్నయినా చెప్పు ఈ రోజుల్లో ఆహారం కనిపించటం లేదు. తినటానికి వెనక ఎన్నడూ కనిపించనంత సాహిత్యం మాత్రం కనిపిస్తున్నది. నే నిప్పుడు చాలా వరకు దానిమీదే ఆధారపడు న్నాను."

"ఆఁ, దాన్ని సాహిత్యమని కూడా అంటావేమిటి? పత్రిక లేగా? వెనక పుస్తకాలుండేవి. వాటిని భద్రంగా దాచే వాళ్లు. కష్టపడి కొంచెమే రుచి చూసినా ఉల్లాసంగా ఉండేది."

(29 వ పేజీ చూడండి)

# పట్నవాసం

(13-వ పేజీ తరవాయి)

"సాహిత్యం మెదడుకు మంచి దంటారు నిజమేనా?"

"అయితే అవునేమో గాని ఈ వీధుల్లో గాలికి ఎగురుతూ ఉండే పత్రికలు తింటే నమ్మకంగా జబ్బు చేస్తున్నది."

"అదేమిటి? సెక్సు పత్రికలూ, సినిమాపత్రికలూ చాలా సరదాగా ఉంటాయిటగా?"

"మొదట బాగానే ఉంటుంది గానిరాను రాను తిండిమీద హితవుకూడాపోతుంది."

"నా చిన్నతనంలో పుస్తకాలుండే వంటే అందులోచాలా మంచిసరుకుండేది. వాటిమీద గౌరవం ఉంచి జాగ్రత్తగా దాచుకునేవాళ్లు. అందుచేత అతిగా తినటాని కుండేదిగాదు. ఒక్కొక్క పుస్తకంలో ఒక్కొక్క మాధుర్యం ఉండేది. ఇప్పుడీ పత్రికలు తేరగా దొరుకుతున్నాయనీ, అవతల సరిఅయిన తిండిఅందటం లేదనీ అతిగా తింటే జబ్బులు చేసుకొస్తున్నాయి. అదీ కాక- ఏంపత్రికలు?- అన్నీ ఒకటిగానే ఉంటాయి. ఒకదానిరుచే రెండో దానికిన్నీ!"

"ఈపత్రికలు తినటంలో అంతో ఇంతో విషం ఉంటుందేమో అనుకుంటా. మాస్నేహితుడొకడు పత్రికదొరికితే పంటకొరకకుండా పోనివ్వడు. అదేమిటోయంటే అందులో మజాఉంది లెమ్మంటాడు."

మామా, పట్నంబావాకూడా ఈ సంభాషణలు అంత దూరంనుంచే విన్నారు. మామ ఒక్కడుగు ముందుకు వేయటం చూసి, "మనకెందుకు, పోదాం పద, బావా," అన్నాడు పట్నంబావ.

"ఓరి ఉండరా! మీపట్నం వాళ్లకున్న తెగులే ఇది. ఎవరికీకాని సంభాషణలు ఆసక్తిగా వింటారు. నలుగురు బుద్ధిమంతులు కూచుని పనికొచ్చేమాటలు మాట్లాడుకుంటే వినలేరు. వాళ్లుమాడు, ఎంతమంచి విషయాలు చెప్పుంటున్నారో!" అన్నాడు.

"వాళ్లు రాజకీయాలు మాట్లాడేవాళ్లు," అన్నాడు పట్నంబావ.

"అంటే?"

"సంఘాన్ని గురించీ, ప్రభుత్వాలను గురించీ, పరిపాలన గురించీ మాట్లాడతారు."

"మాట్లాడనీ, విందాం, తప్పేం?" అన్నాడు మామ.

"ఏమిటో ఈ రాజకీయాలు—" అని పట్నం బావ నసుగుతుండగానే వినిపించుకోకుండా బైతుమామ ముందుకు వెళ్లిపోయినాడు. పట్నంబావ ఆయన్ను అనుసరించక తప్పిందికాదు. (ఇంకావుంది.)


## COMPARE THE PRICES

మా ధరలు నాణ్యత సర్వీసు యే యితర షరములతోనైనను పోల్చిచూడండి మీరు మావద్ద కొనడమే మంచి లాభకరమని తప్పక గ్రహిస్తారని ధైర్యంగా చెపుతున్నాము. ఈ గడియారాలన్ని 4 నుండి 7 యేండ్ల వరకు నిర్దుష్టముగా పనిచేయునని గ్యారంటీ యివ్వబడును. అవి ఒరిజినల్ స్విస్ తోలుతో గాని ప్లాస్టిక్ పట్టాతోగాని ఒక చక్కని మొకమలు పెట్టె కలిపి యివ్వబడును. పోస్టేజి ప్యాకింగు, అమ్మకం పన్ను దారీలు ఉచితము

## ఉచితము

ప్రతి వాచీతో ఒక అమెరికన్ ఫౌంటెన్‌కలము ఉచితము రెండు గడియారాలు కొంటే దయిరీతో ఒక అందమైన కలం పెన్సిల్ సెట్టుగాని ఆధునికమైన ఏటవాలు హెడ్ గల అంతా యిత్తడి 2 సెల్ టార్చిగాని ఉచితము ఒకే సారి మూడు వాచీలు కొంటే ఒక ఆధునికమైన టేబిల్ గడియారం ఉచితము.




ప్రతి వాచీతో అందమైన ఒక ఆధునికమగు ప్లాస్టిక్ కాలెండరు ఉచితము



రెక్టాంగులర్ షేప్ సైజు 7¾

| | | | |
|---|---|---|---|
| 435 | క్రోం స్టీల్ బ్యాక్ | 5 | 33 |
| 436 | రోల్డు గోల్డు సీల్ బ్యాక్ | 5 | 36 |
| 437 | ఫుల్ రోల్డుగోల్డు కేసు | 5 | 40 |
| 4 18 | క్రోం స్టీల్ బ్యాక్ | 7 | 38 |
| 4 9 | రోల్డు గో స్టీల్ బ్యాక్ | 7 | 42 |
| 440 | ఫుల్ రోల్డు గోల్డు కేసు | 7 | 45 |
| 497 | క్రోమ్ స్టీల్ బ్యాక్ | 15 | 50 |
| 498 | రోల్డుగోల్డు స్టీల్ బ్యాక్ | 15 | 55 |
| 499 | రోల్డుగోల్డు స్టీల్ బ్యాక్ | 7 | 42 |
| | మందం గ్లాసుతో | 15 | 62 |
| 499 ఎ | 20 మైక్రోన్సు గోల్డు కేసుతో | 15 | 65 |
| 499 బి | రోల్డుగోల్డు స్టీల్ బ్యాక్ స్పె. | 17 | 75 |
| 593 | 18 క్యారట్ గోల్డుప్లేటెడ్ సెంటర్ సెకండుతో | 15 | 8 0 |



చిన్న సెకండ్ రౌండు సైజు 10½

| | | | |
|---|---|---|---|
| 407 | క్రోం స్టీల్ బ్యాక్ | 5 | 20 |
| 408 | రోల్డు గోల్డుస్టీల్ బ్యాక్ | 5 | 23 |
| 409 | ఫుల్ రోల్డు గోల్డు కేసు | 5 | 26 |
| 410 | క్రోం స్టీల్ బ్యాక్ | 7 | 31 |
| 411 | రోల్డు గోల్డు స్టీల్ బ్యాక్ | 7 | 33 |
| 418 | ఫుల్ రోల్డుగోల్డు కేసు | 7 | 36 |
| 468 | క్రోమ్ స్టీల్ బ్యాక్ | 15 | 38 |
| 469 | రోల్డుగోల్డు స్టీల్ బ్యాక్ | 15 | 43 |
| 470 | 20 మైక్రోన్సు గోల్డు కేసు | 15 | 53 |
| 471 | క్రోం స్టీల్ బ్యాక్ | 17 | 58 |
| 472 | రోల్డుగోల్డు స్టీల్ బ్యాక్ | 17 | 63 |
| 473 | 20 మైక్రోన్సు గోల్డు కేసు | 17 | 73 |



సెంటర్ సెకండ్ రౌండ్ సైజు 10¼

| | | | |
|---|---|---|---|
| 4 1 | క్రోంస్టీల్ బ్యాక్ | 5 | 22 |
| 402 | రోల్డుగోల్డు స్టీల్ బ్యాక్ | 5 | 25 |
| 403 | ఫుల్ రోల్డుగోల్డు కేసు | 5 | 28 |
| 404 | క్రోంస్టీల్ బ్యాక్ | 7 | 35 |
| 405 | రోల్డుగోల్డు స్టీల్ బ్యాక్ | 7 | 38 |
| 406 | రోల్డుగోల్డు స్టీల్ బ్యాక్ | 8 | 43 |
| 474 | క్రోం స్టీల్ బ్యాక్ | 15 | 43 |
| 475 | రోల్డుగోల్డు స్టీల్ బ్యాక్ | 15 | 48 |
| 477 | క్రోం స్టీల్ బ్యాక్ | 17 | 65 |
| 478 | రోల్డుగోల్డు స్టీల్ బ్యాక్ | 17 | 70 |
| 479 | 20 మైక్రోన్సు గోల్డు కేసు | 17 | 80 |



వాటర్ ప్రూఫ్, షాక్ ప్రూఫ్, డస్టుప్రూఫ్, ఆంటి మాగ్నెటిక్ సెంటర్ సెకండ్ సైజు 8¾

| | | | |
|---|---|---|---|
| 530 | క్రోం స్టీల్ బ్యాక్ కేసు ఫ్లాట్ షేపు రేడియం డయల్ | 15 | 85 |
| 531 | రోల్డుగోల్డు స్టీల్ బ్యాక్ కేసు ఫ్లాట్ షేపు రేడియం డయల్ | 15 | 90 |
| 532 | 20 మైక్రోన్సు గోల్డు కేసు ఫ్లాట్ షేపు రేడియం డయల్ | 15 | 95 |
| 533 | క్రోం స్టీల్ బ్యాక్ కేసు ఫ్లాట్ షేపు రేడియం డయల్ | 17 | 105 |
| 534 | రోల్డుగోల్డు స్టీల్ బ్యాక్ కేసు ఫ్లాట్ షేపు రేడియం డయల్ | 17 | 110 |

## ASIA WATCH HOUSE

DIRECT IMPORTERS OF WATCHES

433, SADASHIVE LANE P. B. 3607, GIRGAUM, BOMBAY-4

ADAPEX



# పట్నవాసం

పట్నంబావ చెప్పిన మాట నిజమే. అక్కడ సాగే సంభాషణ రానురాను తీవ్ర రాజకీయాల ధోరణి అవలంబించింది. మామ తన జీవితంలో మాలావు కొట్లాటలే చూశాడు గాని ఇంత తర్జనభర్జన వాగ్వాదము ఎన్నడూ వినలేదు. కేవలం సిద్ధాంతాలు ఇంత ఉద్రేకాన్ని రెచ్చగొడతాయని ఆయన కలలోకూడా ఊహించలేదు.

"ఈ ప్రభుత్వం ఆహారసమస్యను పరిష్కరించదు. ఎట్లా పరిష్కరిస్తుంది? దున్నేవాడిదే భూమి అన్న సిద్ధాంతాన్ని ఆమోదిస్తేనేగాని ఆహారసమస్య పరిష్కారం కావటానికి విఘ్నేశ్వరపూజ కూడా కాదు. భూస్వాముల్నీ, జమీందార్లనీ బలపరుస్తున్నారు. ఇదెట్లా కుదురుతుంది?"

"నువ్వనేదేమిటి? ఎవళ్ళనోటనన్నా మట్టి గొడితేగాని సమస్యాపరిష్కారం కాదంటావు, పోరా రష్యావాడా!"

"మధ్య నాదేం పోయింది? జమీందార్ల నోట మట్టిగొట్టటం ఇష్టం లేకపోతే మిగిలిన వాళ్ళందరి నోటా మట్టిగొట్టూ! తింటూనే ఉన్నారుగా శేషనుబియ్యం?"

"సమస్యను సౌమ్యంగా పరిష్కరించుకోవటమంటూ లేదేమిటి?"

"ఉచ్చు మెల్లిగా బిగించుకుంటే ప్రాణం పోదని నీ వాదం! హుఁ!"

ఇంతవరకు మౌనంగా ఉన్న బొంగురు గొంతుఎలుక గొంతు సవరించుకుంది.

"మనకు ప్రస్తుతం కావలిసింది క్రమబద్ధమై, ఒడుదుడుకులు లేని ప్రజాజీవితం. అరాచకంవల్ల మనకు స్వేచ్ఛ ఎక్కువ ఉంటుందని కొన్ని బుద్ధిమాలిన ఎలుకలు

## శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

అనుకోవచ్చు. అది శుద్ధ పొరపాటు. అరాచకంవల్ల మనకు లభించే స్వేచ్ఛ చావు స్వేచ్ఛ. అది మన జాతియొక్క వినాశనానికే దారి తీస్తుంది. మనం వ్యక్తివాదాన్ని కొంత హద్దులో ఉంచితేగాని ప్రజాస్వామికొన్నయినా అమలు చేయలేం.... చూడండి కిందటిసారి ఈ పట్నంలో యుద్ధభయం వచ్చినప్పుడు వందలాది ఇళ్లు ఖాళీ పడ్డాయి. నాకు బాగా జ్ఞాపకం. మేం బలే సంతోషించాం. పగలయేది, రాత్రయేది యథేచ్ఛగా తిరిగే వాళ్ళం. పట్టపగలు వీధుల్లో చెడుగుడూ, చెర్పట్టీ ఆడామంటే నమ్మండి. కాని ఈ స్వేచ్ఛ ఎందుకైనా పనికొచ్చిందా? ఎక్కడా తిండిలేదు. చచ్చేకరువు. అందరం నీరసించిపోయాం. ఆ స్వేచ్ఛ మా అవసరాలు తీర్చలేకపోయింది.. మళ్ళీ జనం తిరిగి రాసాగారు. ఖాళీఇళ్లు నిండసాగాయి. మా స్వేచ్ఛ అరికట్టింది. కాని మళ్ళీ జీవితం క్రమబద్ధమయింది. తిండి దొరికింది."

ఇంకో కీచుగొంతు ఎలుక అందుకుంది. "పెదనాన్న చెప్పిందాల్లో అబద్ధంలేదు. కాని ఆయన ప్రజాస్వామ్యమంటున్నాడే అది ప్రస్తుతం పెద్ద అబద్ధం. ధనికస్వామ్యం ఉండగా ప్రజాస్వామ్యం ఎట్లా సాగుతుంది? ధనికులు ప్రజలను యథేచ్ఛగా పనులు చేసుకోనివ్వరు. వాళ్ళ శ్రమ ఫలితం వాళ్ళకి దక్కనివ్వరు. సంఘంలో కల్లోలాలు తెప్పిస్తారు. యుద్ధాలు తెచ్చిపెడతారు. అశాంతి తెచ్చిపెడతారు. ఏ

సిద్ధాంతాలపైనా ప్రభుత్వాన్ని సాగనివ్వరు. ధనికవాదంలో అశాంతీ, అరాచకం ఇమిడిఉంది. ధనికవాదంకింద క్రమపరిపాలన అసాధ్యం. ఉదాహరణ చూడండి. న్యాయశాఖను స్వతంత్రం చేస్తున్నా మన్నాడు. ఒక బాధ్యతగల ప్రజామంత్రి, 'మేం పట్టుకున్నవాళ్ళే దొంగవ్యాపారస్తులు. మా పోలీసులు కాల్చిన వాళ్లే కమ్యూనిస్టులు' అంటాడు! ఇంతకంటె అరాజకం ఎట్లా ఉంటుందీ? అందుచేత నిజమైన ప్రజాస్వామికం రావాలంటే సోషలిస్టువిధానంతో కమ్యూనిజం ఏర్పడి తీరవలసిందే."

"నినాదాలు వొట్టి అర్థంలేని మాటలు! కమ్యూనిజం మనకు ప్రబల శత్రువు. కాస్త ఆలోచిస్తే అది రుజువవుతుంది," అన్నారు మరొకరు. "ప్రజాస్వామికంలో కొద్దిమందికే ఆస్తి హక్కులంటే మనం ఇట్లా తల్లడిల్లిపోతున్నామే, కమ్యూనిజంలో అందరికీ ఆస్తిహక్కులుంటాయి. అప్పుడందరూ మనకు పరమశత్రువులే అవుతారు. మనకు ఏ దరిద్రులైతే అప్తులని ఇవాళ అనుకుంటున్నామో ఆ దరిద్రులు ఆనాడుండరు. అప్పుడు మనగతి ఏమిటి?"

మామకీ వాదం అర్థం కావటమే కాక సబబుగా కూడా కనిపించింది.

కీచుగొంతు మళ్ళీ మాట్లాడసాగింది.

"మనిషి వస్తుతహా మనకు విరోధి అన్న ఉద్దేశంతో మాట్లాడుతున్నావు. ఇది అబద్ధం. మన ఉనికికి అతి ముఖ్యమైనది సమృద్ధి అయిన సంపద. సమాజంలో ఉత్పత్తిశక్తులు పైచూపు చూస్తున్నంతకాలమూ మనకు పూర్తిక్షేమం ఉన్నది. సామాజిక మానవుడు తన పొట్ట తాను పోసుకునే శక్తి హస్తగతం చేసుకున్న తరవాత మన చిన్న పొట్టలను చూసి అసూయపడడు. వర్గసంబంధాలు ఉత్పత్తిసాధనాలపై గల హక్కులతోపాటు మారుతాయని మార్క్సు గట్టిగా చెప్పాడు. ఇది అక్షరాలా నిజం. ఉత్పత్తి నిర్విఘ్నంగా అభివృద్ధి అయేది ఎక్కడ? ధనికస్వామ్యంలోనా, సామ్యవాదంలోనా? ఎందుకీ తెలియని కబుర్లు?"

"ఈ రష్యనుపత్రికలు తిని ఇటువంటి దుర్బుద్ధులు వంట పడుతున్నాయి."

"అమెరికను పత్రికలు తిని తెచ్చుకునే రోగాల మాటేమిటి?"

"రష్యాపత్రికల్ని అమ్మకుండానూ, కొనకుండానూ చేస్తే దేశం క్షణంలో బాగుపడుతుంది."

"అంబ పలుకుతున్నది! అదీ అసలైన ధనికవాద ప్రజాస్వామికం."

"ప్రజాస్వామికంకింద వాటి విక్రయం నిషేధించటం సాధ్యం కాకపోతే వాటిని కొనేవాళ్ళని మక్కెలు విరగదన్నితే సరి! రోగం వదిలిపోతుంది."

"అవునన్న గూర్ఖా! నీ ప్రజాస్వామికం ఫాసిజంకు తోబుట్టువు. అదే నేనూ అంటున్నాను."

"ఒక చెంప ఈ రష్యాపత్రికలు అరాచకం తెచ్చిపెడుతుంటేను వ్వేమిటో సిద్ధాంతాలు చెబుతావేమిటి?"

"నువ్వు చెప్పే పనులన్నీ జరుగుతూనే ఉన్నాయి. అక్కడ ధర్మం నాలుగు కాళ్లా నడిచి, అందరు సుఖంగా తిని కడుపులో చల్ల కదలకుండా కూచున్నారని నీ భ్రమ. సిద్ధాంతాలంటే అంత విద్వేషం దేనికీ? సిద్ధాంతం లేకుండా ఆచరణంటూ ఎక్కడన్నా ఉందీ?...మన గర్భశత్రువులైన పిల్లులు పాలుతాగుతూ కళ్లు మూసుకుంటాయి. ఆ అలవాటే మనంకూడా ప్రారంభించామంటే ఎంతవరకు దిగజారామో ఊహించుకోవచ్చు."

రానురాను మాటలు చురుకెక్కాయి. ఒకరు స్టాలిన్‌నూ, మరొకరు ట్రూమన్‌నూ, ఒకరు రష్యానూ, మరొకరు అమెరికానూ తిట్టుకున్నారు. ఒకరు యుద్ధాన్ని మరొకరు శాంతినీ తిట్టేదాకా వచ్చింది.

ఈ తిట్లూ, శాపనార్థాలూ మామకు రుచించలేదు. మొట్టమొదటచర్చవల్ల మామకు చాలా విషయాలు కొత్తవి తెలిశాయి గాని ఈ తిట్లవల్ల ఏమీ కొత్త విషయాలు తెలియలేదు.

మామ కదిలే ధోరణిలో ఉండటం చూసి పట్నంబావ పక్కనే ఉన్న కాఫీ హోటలుకేసి దారి తీశాడు.

రోడ్డు దాటుతూ పట్నంబావ "ఆ వెధవ సంభాషణ నువ్వింతసేపు ఎట్లా విన్నావో గాని నాకు తగని తలనొప్పి," అన్నాడు.

మామ నడిరోడ్డులో ఆగి నిశ్శబ్దంగా ఉన్న రోడ్డుకేసీ రోడ్డువెంట వెలిగే దీపాలకేసీ చూస్తూ, తన బావమరిది అన్న మాటలు వినిపించుకోలేదు.

"ఈ పట్నంలో ఎంతో అందం ఉన్నది, నేను కనిపెట్టలేకపోయినాను గాని!... కాని ఇది దగా. దీని అట్టడుగున నిజమైన శాంతి లేదు. రాక్షసులూ, దయ్యాలూ నిద్రపోతుంటే ప్రశాంతత ఉంటుంది. కాని అది ప్రశాంతత కాదు," అన్నాడు మామ, తనలో తాను మాట్లాడుకుంటున్నట్టుగా.

"ఆకలి దహిస్తున్నది. పోయి ఏమన్నా తినటానికున్నదేమో చూద్దాం," అన్నాడు పట్నంబావ.

హోటలు నిశ్శబ్దంగా ఉంది. పగలల్లా గొంతులు పగిలేట్టు అరిచి, కాళ్ళు పడేట్టు తిరిగి, చేతులు విరిగేట్టు ఫలహారాలందించిన దౌర్భాగ్యులు ఒళ్లు మైమరచి మహారాజులు పొందలేని నిద్రసౌఖ్యంలో ఉన్నారు.

బావమరుదులిద్దరూ ముందు పాకశాల ప్రవేశించారు. అక్కడ చాలా వేడిగా ఉంది.

"ఆ భాండీలో నూనె చూడు. హోటలు తెరిచిన రోజున దాన్లో పోసిన నూనె. మళ్ళీ తీయలేదు. రోజూ దానికి కొత్తనూనె కలుపుతుంటారు. ఈ డబ్బాలనిండా రకరకాల పిండి ఉంటుంది. ఆ టిన్నులన్నీ నూనెటిన్నులే."

మామ పట్నంబావ చెప్పేది వింటూ పాకశాల అంతటా కలయదిరుగుతున్నాడు. అన్నిటిమీదికీ ఎక్కి దిగుతున్నాడు. ప్రతిదీ వాసన చూస్తున్నాడు. ఒక మూల ఉల్లిపాయలూ, పచ్చిమిరపకాయలూ, బంగాళాదుంపలూ, ముల్లంగి దుంపలూ, చిక్కుళ్ళూ మొదలైనవి పోగేసి ఉన్నాయి. మామ అన్నిటినీ రుచిచూశాడు. ఇన్ని కూరలు ఒక్కసారి కనిపించేసరికి మామకు పరమానందమయింది.

"ఇదేమిటబ్బా, మంచి సువాసనగా ఉందీ?" అంటూ మామ సబ్బు కొంత గీకి రుచి చూశాడు. మొదట బాగానే ఉన్నట్టుంది గాని క్షణంలో మొహం మొత్తింది.

"ఇక్కడేముంది? అవతలి గదికి పోదాం పద," అన్నాడు పట్నంబావ.

అవతలి గదిలో నేలమీద రకరకాల తినుబండారాలు పడిఉన్నాయి. తీపి సరుకూ, పకోడీలూ, బూందీ, గారెముక్కలూ, బజ్జీతుంపులూ ఇంకా ఏమేమిటో ఉన్నాయి.

మొట్టమొదట తాముతప్ప అక్కడ ఇంకెవరూ లేరనుకున్నాడు గాని త్వరలోనే ఈ భ్రమ నివారణ అయింది. ఇంకా చాలా ఎలుకలు కుర్చీలకిందా, బల్లలకిందా కూర్చుని ఏవేవో తింటున్నాయి. మామకు వాళ్ళ పరిచయం చేసుకో బుద్ధి అయింది. కాని పట్నంబావ ఎంతమాత్రమూ ఒప్పుకోలేదు. విసురుగా పరిగెత్తవద్దనీ, అవీ ఇవీ ఎక్కి దూకవద్దనీ కూడా పట్నంబావ మామకు సలహా ఇచ్చాడు.

"ఎంతసేపూ ఎవరికి వారేనా?" అన్నాడు మామ విసుగ్గా.

"కాకపోతే ఏమిటి? ఇక్కడ చాలా వ్యత్యాసాలున్నాయి. గొప్పఇంటి ఎలుకలు కొద్దిఇంటి ఎలుకలను చిన్నచూపు చూస్తాయి. ఒకరిచేత ఒకమాట ఎందుకనిపించుకోవాలి, ఎవరి మానాన వారుంటే

ఎవరి మర్యాద వారి కుంటుంది. అటువంటి ఆచారం ఉంది కనకనే ఇక్కడ ముందు పరిచయంలేనివాళ్లు లోకువ వవుతారు."

ఇద్దరూ కలిసి బీరువాపైకి ఎక్కారు. బీరువాకు అద్దా లున్నాయి. అద్దాలతత్వం తెలీక మామ లోపల కనిపించే తినుబండారాలమీదికి లంఘించి ముక్కు గట్టిగా చితకగొట్టుకున్నాడు. పట్నంబావ అద్దాలనుగురించి మామకు తెలియజెప్పాడు.

"ఈ అద్దాలు పట్నంబతుక్కు తగ్గట్టే ఉన్నాయి. అన్నీ ఆకర్షించేటట్టుగా ఎదట ఉండటమూ, అందుకోబోతే మొహం పగలటమూనూ. ఏమి టీ కపటనటన?" అన్నాడు మామ ముక్కు రుద్దుకుంటూ.

"అద్దంలోనుంచి కనిపించే కపటనటన చూడు. ఈ సరుకంతా రేపు తాజాసరుకులో కలిసిపోతుంది. ఆ గంగాళంలో సాంబా రుంది. అది రేపు వేడిసాంబారులో చేరిపోతుంది"

"అచ్చాలతో లుచ్చాలు చేరుతా రందూ!" అన్నాడు మామ విరక్తిగా.

బాగా పొట్టలు నింపుకుని బావమరుదు లిద్దరూ ఇంటిదారి పట్టారు.

## 8

ఇంటిదగ్గిర ముసలావిడ కునుకుతూ, కళ్లు తెరుస్తూ ఉన్నది. ఒకసారి ఆవిడ దృష్టి సారించి చూచేసరికి ఎదురుగా ఏదో జిగాల్న మెరిసింది. ఆవిడ బలవంతాన కదిలి దానిదగ్గిరికి వచ్చింది. అదొక వింత వస్తువు. దానిలోపల ఒక రొట్టెముక్క వేళ్లాడుతున్నది. ఆ రొట్టెముక్కనుంచి కమ్మని వెన్న వాసనకొడుతున్నది. ఆ వెన్న ఆవిడ ముసలిహృదయాన్నికూడా ఎంతో ఆప్యాయంగా పిలుస్తూ, "రా! వచ్చి నన్ను రుచిచూడు!" అంటున్నది. ఆ పిలుపుకు ఆవిడరక్తం సుళ్లుతిరుగుతున్నది.

కాని ఆ రొట్టెముక్కను చేరే ఉపాయం లేదు. దానిచుట్టూ సన్నని, గట్టి చువ్వలు కటకటాల్లాగా ఉన్నాయి. చువ్వలు మహా అందంగా, నున్నగా, పైనా, కిందా వొంపులు తిరిగి ఉన్నాయి. ఆవిడ బోను చుట్టూ ఒక ప్రదక్షిణం చేసివచ్చి ఒకచోట కూర్చుని వాసనతో సంతృప్తి పడుతున్నది.

ఈ సమయంలో బాలుడు వచ్చాడు. బోనుచూసి ఆశ్చర్యంతో ఆగాడు. వాడికూడా వాసనతగిలింది. బోనుమీదికి ఒక్కదూకు దూకాడు. ఎన్నోసార్లు దానిమీదికి ఎక్కాడు, దిగాడు. బోను చువ్వలు కొరికాడు. అవి కొరుకుడు పడలేదు. బాలుడిప్రాణం తల్లడిల్లిపోతున్నది. ఆ రొట్టెముక్క నోట పడేదాకా వాడికింకో ఆలోచన బుర్ర కెక్కదు.

"లాభంలేదురా నాయనా!" అన్నది ముసలావిడ. బాలుడు వినిపించుకోలేదు.

తీరా బాలుడు లోపలికి ఎట్లా వెళ్ళాడో ముసలావిడ చూడనేలేదు. ఒక క్షణం బోనుమీద ఉన్నవాడు, గారడీలాగా మరుక్షణం బోనులో ఉండి రొట్టెను ఆత్రంగా తినేస్తున్నాడు. చూస్తుండగానే రొట్టె హరించుకుపోయింది. వాడి ఆకలీ, ఆత్రమూ కూడా చల్లారాయి. వాడు బయటికి రావటానికి చూశాడు. కాని బయటికి దారి ఎటో తెలియలేదు. తాను ఎట్లా లోపలికి వచ్చిందీకూడా వాడికి తెలీదు. వాడి అంతరాత్మలో ఏ మూలో సన్నగా భయం ప్రారంభ మయింది. కాని ఇంతలో వాడి తల్లీ, కొందరు పిల్లలూ తిరిగి వచ్చేసరికి మళ్ళీ ధైర్యం వచ్చింది.

"నీ మనవాడు చూడవే, కడవంత రొట్టె కమ్మగా తిని ఎట్లా లోపల కూర్చున్నాడో!" అన్నది ముసలావిడ కోడలితో.

"అందులో దూరా వేమిట్రా? రా బైటికి," అన్నది తల్లి.

"నేను రాను. నే నిక్కడే ఉంటా నా యిష్టం, అన్నాడు బాలుడు. తనకు బయటికి రావటం చాతకాలేదన్నది తల్లి ఊహించటం వాడికిష్టం లేదు.

"ఓరీ! లోపలి కెట్లా వెళ్ళావురా? ఎక్కడా దారి లేదే?" అన్నారు పిల్లలు ఆశ్చర్యంతో.

"అదే గమ్మత్తు!"

"మా కూడా చెప్పవూ?"

"ఎం తాశే!"

"కొంచెం చెప్పరా!"

"చాతయితే మీరే కనుక్కోండి!" అన్నాడు బాలుడు. లోపల ఒక్కడే అయిపోయినాడు. ఇంకెవరన్నా కూడా వస్తే తనకు తోడుంటుందని ఒక ఆశా, లోపలికి వచ్చేదారి కనుక్కోవచ్చునని మరొక ఆశా వాణ్ణి పట్టుకుంది. అయితే మిగిలినవాళ్ళెవరూ లోపలికి పోవాలని ప్రయత్నించలేదు. లోపలినుంచి ఏదో చెప్పరాని భయం తన్నుకొస్తున్నది. కాని మిగిలిన వాళ్లు తనను చూసి అసూయపడుతున్నారనీ, అందుచేత తన కేమీ భయం లేదనీ బాలుడు తనకు తాను ధైర్యం చెప్పుకోసాగాడు.

ఇంతలో అక్కడికి పట్నంబావా మామా తిరిగి వచ్చారు. బోనూ, బోనులోపిల్లాడూ కనపడగానే పట్నంబావకు కాళ్లు చల్లబడ్డాయి. ఆ బోనేమిటో పట్నంబావ ఎరుగును.

"ఒరే అదేం పనిరా? దాని జోలి కెందుకు పోయినావురా?" అన్నాడు పట్నంబావ వొణుకుతున్న గొంతుతో.

తండ్రి గొంతు చెవిని పడగానే బాలుడు అణుచుకుంటూ ఉన్న భయంకాస్తా ఒక్కసారిగా పైకి తన్నింది. కాని వాడు దర్పంకొద్దీ "నాయిష్టం! కావాలనే లోపలి కెళ్ళాను! నేను బయటి కూడా రాను. ఇందులోనే ఉంటాను,"అన్నాడు.

పిల్లలందరూ గొల్లున నవ్వారు.

"నేను టార్జాన్‌ని! ఆ-ఆ-ఆ!"

పిల్లలు మళ్ళీ నవ్వారు. బాలుడి తల్లి కూడా చిరునవ్వు ఆపుకోలేకపోయింది. బోనంటే ఏమిటో ఆవిడకి సరిగ్గా తెలియదు.

మామకు లోపల మహాగ్ని ప్రజ్వరిల్లుతున్నది. ఎవరిమీదో తెలీదు. ఎందుకో తెలీదు. "ఇదంతా తప్పు! వీడీ బోనులో ఇరుక్కోవటం తప్పు! వీడు మాట్లాడేదంతా తప్పు! మిగిలినవాళ్లు హర్షించటం తప్పు! పట్నంబావ కాళ్ళూ, చేతులూ వొణుకుతూ తరతరలాడటం తప్పు! మొత్తం అంతా తప్పే!" అని మామ అంతరాత్మ ఆక్రోశిస్తున్నది. ఆయన బోనుచుట్టూ శ్రద్ధగా తిరిగాడు. లోపలికి వెళ్లే ద్వారమేదో ఆయనకు తెలిసింది. మెల్లిగా అడుగులు వేసుకుంటూ చువ్వల వంపునుబట్టి లోపలికి పాకాడు. కాని కింద రేకు కిందికి కొంచెం దిగింది. మామ ఒళ్లంతా చెప్పరాని భయంతో జలదరించింది. రెండో కాలితో బోను చువ్వను గట్టిగా పట్టుకుని బిళ్ళమీద పెట్టిన కాలు మరికాస్త గట్టిగా నొక్కాడు మామ. బాలుడు పట్టీపట్టని కంత ఏర్పడింది.

"బయటికి రా ఫుండాఖోర్?"అన్నాడు మామ, చీలిన వెదురుగొట్టంలాటి గొంతుతో.

అదివరకల్లా బాలుడు ప్రకటించిన దర్పం హరించుకుపోయింది. వాడు గబగబా ముందుకొచ్చి తన కాలితో బిళ్ళను పూర్తిగా అడుక్కు నొక్కి బోనువాకిలికీ మామకూ మధ్య ఉండే సందులోనుంచి బయటపడటానికి కంగారుతో కూడిన యత్నం చేశాడు. బిళ్ళమీద వాడి కాళ్లు జారాయి.

"భద్రం, భద్రం! నన్ను లోపలికి లాగేవు! కంగారు పడకు. ఉపాయంగా రా! నన్ను గట్టిగా పట్టుకో. అట్లా! పక్క

(43-వ పేజీ చూడండి)

పోనీ, రంభ, పేగులెండిపోయిన పేద పాణ్ణి వర్ణిస్తుందా!

రత్నాలు: రంభసిగ తరిగిరి. ఆ దేవణ్ణి వరిస్తే నాకేం గాని, బావగారూ! ఎలాగో మీకీ సంబంధం అంగీకరించాలి. మీ మాటకి ఎదురాడేవాళ్లు మీ యింట్లో ఎవరూ లేరు.

* * *

అవధా: రత్నాలూ మీ లీడరుసంగతి నాకు తెలియందికాదు. కొడుకు పెళ్లంటే చింకి తట్ట పట్టుకు కూర్చుంటాడూ? కూతురు పెళ్లనే సరికే ఒచ్చిందా కటికి దరిద్రం?

రత్నాలు: ఆయనకి మీ కున్న సంస్కారం లేదండీ.

అవధా: సంస్కారం లేదనకు; సంకోచం లేదనూ; సందేహం లేదనూ. సరే అతనికొడుక్కి ఆయనెంత కట్నం పుచ్చుకుంటాడో అంతే నేనూ పుచ్చుకుంటాను సరా.

(తెర లో)

నాన్నా! కట్నాలు పుచ్చుకోండి మానుకోండి. మా ఆడపడుచు కట్నాలు మాత్రం మాకిచ్చి తీరాలి. నూటపదహార్లకి తక్కువైతే ఒప్పుకోం.

అవధా. చూసేవా మా పెద్దపిల్ల ఆలూ లేదు చూలూ లేదు అప్పుడే ఆడపడుచు కట్నం కావాలట.

(తెర లో)

నీకుండోయ్, అబ్బాయికి వెండి చెంబులు, పట్టుపంచలు, వంకికంచం, ఉంగరం, రిస్టువాచీ, సైకిలు, అదనంగా ఇవ్వాలి మఱచిపోకండి.

అవధా: మాఆవిడ, కోరవలసినవన్నీ కోరిందో ఇంకా ఏవేనా మఱచిపోయిందో కనుక్కోవాలి.

(శర్మప్రవేశం. ఇరవైయేళ్లకు మించి ఉండవు. చామనఛాయ; నవనాగరికత బలిసిఉన్న వేషం—)

అవధా: అడుగో మా అబ్బాయి సరిగ్గా వేళకొచ్చేడు.

శర్మ: (రత్నాల్ని చూడకుండానే) నాన్నగారూ! ఈవాళ ఓ గొప్ప పామిస్టొచ్చి కృష్ణాజిల్లా స్టూడెంట్సు చేతులన్నీ చూసేడు.

అవధా: నీ చెయ్యి చూసేడా?

శర్మ: (సగర్వంగా) ఓ.

అవధా: ఏం చెప్పేడు. మీ ఫాదరు ఈ ఏడాదిలోగా పరమపదిస్తాడని చెప్పేడా.

శర్మ: అదేమిటి నాన్నగారూ ఎప్పుడూ Sentimental గానే మాటాడుతారు. చాల బాగా చెప్పేడు.

అవధా: ఏమిటో బాగు.

శర్మ: నా Wife పెద్ద డౌరీతోను. Lands తోను ఒస్తుందన్నాడు నాన్నగారూ!

అవధా: (గంభీరంగా) ఏపాటి Figure చెప్పాడా.

శర్మ: పది పదిహేను వేలుంటుందన్నాడు.

అవధా: ఇంతేనా.

శర్మ: మరి Lands కూడా చెప్పేడుగా.

అవధా: ఇంకా ఏం చెప్పేడు.

శర్మ: (సగర్వంగా) నాకు ఫారిన్ టూరుందటండీ.

అవధా: ఓహో. బాగానే ఉంది ఇంకేం. ఆ కట్నంతో అమెరికా వెళ్ళిరావచ్చు. (రత్నాలవైపు తిరిగి) చూసేవా రత్నాలూ, మన చదువులు, సంస్కారాలు ఇలాగున్నాయి.

శర్మ: (రత్నాలవైపు చూసి కొంచెం తెల్లబోయి) (Good morning sir) మీ రెప్పుడొచ్చారు.

రత్నాలు:- ఇప్పుడే అంతా ఓగంటయింది.

అవధా:- రత్నాలు నీకో సంబంధం తెచ్చేను. మాణిక్యంలాంటి పిల్ల. చదువుకుంది. సంగీతసరస్వతి బాగుందా.

శర్మ: అన్నీ బాగున్నాయి. కాని పిల్లని చూస్తేగాని నా మాటివ్వలేను.

అవధా: కాని ఒక్కమాట. ఆయన కట్నం ఏవీ ఇచ్చుకోలేడు. ఏదో తగదు మాత్రం—

శర్మ: (మొగంముడిచి) ఏదో నాన్నగారూ! అమ్మ కట్నం పదివేలకి తక్కువైతే ఒప్పుకోదనుకుంటా.

అవధా. నువ్వా, మీ అమ్మా పెళ్ళాడేది. నీమాట చెప్పు.

శర్మ: (మెల్లగా) అమ్మ మాటేనా మాట.

రత్నాలు: శర్మా! చదువుకున్నవాడివి. నువ్వూ కట్నం అంటే ఎలాగ?

శర్మ: చదువుకున్నవాణ్ణి కాబట్టే కట్నమండీ.

అవధా: మంచి సంబంధం నాయనా!

శర్మ: ఆఁ, దీని తాత సంబంధం మరొకటొస్తుంది. (అని చర్రున లేచి వెళతాడు).

అవధా: రత్నాలూ! నీ సందేహం తీరిందా? కట్నం నిజంగా కోరేది తండ్రో, కొడుకో బోధపడ్డదా?

రత్నాలు: తెలిసింది. ఇంక సెలవు.

(తెర)

# పట్నవాసం

(15-వ పేజీ తరవాయి)

నన్ను చువ్వ నోటితో పట్టుకో, నేను కొంచెం వెనక్కిపోయి నీకు దారియిస్తా!" అని మామ హెచ్చరించాడు.

అతికష్టంమీద బాలుడు బయటపడ్డాడు.

మరో క్షణం మిగిలినవాళ్ళంతా బాలుడి చుట్టూ చేరి వాణ్ణి పొగడసాగారు. "ఎంత ధైర్యం, గలవాడివిరా!... ఇంకోళ్ళయితే బయటికి రాలేకపోదురు."

బాలుడు గప్పాలు కొట్టాడు.

"ఇంకాస్సేపుందా మనుకున్నా, మామ వచ్చి అంతా పాడుచేశాడు. మీరంతా రారేమో, హాయిగా అందులోనే పడుకుని నిద్దరపోదా మనుకున్నా. అంగుళ్ళోంచి చూస్తుంటే మీరంతా జైల్లో ఉన్నట్టు కనపడ్డారు నాకు!"

వాడి ప్రతిమాటకూ మిగిలినవాళ్ళంతా ఒకటే ఆనందించటం. వాళ్ళనూ, వాళ్ళ మాటలనూ చూస్తున్నకొద్దీ మామకేదో చెప్పరాని వికారం విరక్తి నీరసం కలగసాగాయి. ఆయన ఎటో తెలియకుండా అక్కణ్ణుంచి బయలుదేరాడు...

బోనులోపడిన ఎలుక తప్పించుకుపోవటం అందరూ అనుకున్నంత అపూర్వం కాదు. కాని ఆ యింటివాళ్లు మర్నాడు అటకమీదినుంచి బోను తీసి అందులో ఎలుక లేకుండానే రొట్టెముక్క మాయమయినందుకు ఎన్నోసార్లు ఎంతోమందికి విడ్డూరంగా చెప్పుకున్నారు.

"తస్సదియ్యా! ఈ పట్నంఎలుకలు ఎన్ని విద్యలు నేర్చాయో! వీటెక్కడా పట్నంనీళ్లు వంటబట్టాయన్నమాట!" అని వాళ్లు విసుగు లేకుండా ఆశ్చర్యపడ్డారు...

చైతుమామ తన ఇల్లు చేరుకునేటప్పటికి బాగా అంత పొద్దెక్కింది.

"నిన్నల్లా అవుపించకనే పోతివి. ఎక్కడికెళ్లావు మామా?" అని చాలా మంద పలకరించారు

"పట్నం వెళ్ళా!" అని వాళ్లందరికీ మామ సమాధానం చెప్పాడు.

"ఎట్లాఉంది పట్నం జీవితం?"

"ఆఁ, మనవాళ్లు ఆత్మహత్య చేసుకునేటందుకు రకరకాల విద్యలు నేరుస్తున్నారు." అన్నాడు మామ.

ఇంతకంటె ఆయన ఎవరికీ పట్నం గురించి ఏమీ చెప్పలేదు.

[అయిపోయింది.